MAHILA SADHIKARATHA

# మహిళా సాధికారత

స్వయంసహాయ ఉద్యమ సమాచార తెలుగు మాస పత్రిక

mas

సంపుటి : 22 సంచిక: 12 రంగారెడ్డి ఆగస్ట్ 2024 పేజీలు : 36 వెల : రూ. 10/-

## ఉగాండా పొదుపు సంఘాల జాతీయ సమ్మేళనం !





వేదికపై ఉగాండా ప్రముఖులతో శ్రీ సి ఎస్ రెడ్డి (పైన)
భారీ సంఖ్యలో సమ్మేళనంలో పాల్గొన్న ప్రతినిధులు (క్రింద)

## ఏపిమాస్ 23 వ వార్షికోత్సవ సంరంభం !








ఏపిమాస్ వార్షికోత్సవంలో జ్యోతి ప్రజ్వలన (పైన)
వార్షికోత్సవంలో పాల్గొన్న కొందరు ప్రముఖులు (క్రింద)



ఆంధ్రప్రదేశ్‌లో స్వయంసహాయ సమాఖ్యలు, ఎఫ్ పి ఓల పనితీరుపై అధ్యయన నివేదికను గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీ శశిభూషణ్ కుమార్‌కు అందజేసిన దృశ్యం




ఐకార్ నార్మ్ , ఎ-ఐడియా ఆధ్వర్యంలో ఎఫ్ పి ఓల సి ఇ ఓలకు నిర్వహించిన శిక్షణను నాబార్డ్ తెలంగాణా ప్రాంతీయ కార్యాలయ సి జి ఎం శ్రీమతి సుశీల చింతల ప్రారంభించినప్పటి దృశ్యం

NABARD
నాబార్డ్ సౌజన్యంతో ....

# భూమి, నీటి సంరక్షణ మరియు యాజమాన్యం

భూమిలో సారం ... మొలకకు ఆధారం

కీలక దశలో అందే నీరే పెరిగే పంటకు జీవం

## చేపట్టే పనులు




NABARD

# మహిళా సాధికారత


సంపుటి 22 సంచిక 12




## అవకాశాలు !

సంపాదకీయం

ఏ పని చేయాలన్నా పరిస్థితులు అనుకూలించాలని అంటారు. ఉదాహరణకు పంటలు వేయాలంటే, వానలు కురిసే వర్షాకాలం కోసం, ఆ అదును కోసం ఎదురుచూస్తాం కదా! ప్రతికూల పరిస్థితులలో కూడా అనుకున్నది సాధించగలగడం సాధకుల లక్షణం. వారు ప్రతికూలాలను కూడా అనుకూలాలుగా మార్చుకోగలుగుతారు. అయితే, ఎంత సహకార, ప్రోత్సాహాలు లభించినా యిది అందరివల్లా అయ్యే పని కాదు. అయితే, పరిస్థితులు అనుకూలించాలనుకోవడం కొంతవరకు సబబే అయినప్పటికి, సానుకూల పరిస్థితులలో కూడా అనుకున్నది సాధించే కృషి చేయకపోవడం, అనుకూల అంశాలను అందిపుచ్చుకోలేక పోవడం అవివేకమే అవుతుంది. ఇప్పుడు మనం మన వివేకాన్ని మేల్కొల్పి, సాధించాలనుకున్న వాటిని సాధించే కార్యాచరణకు నడుం బిగించవలసిన సానుకూల సమయం మన కళ్ళ ఎదురుగా వుంది. అది ముగిసిపోక ముందే సరికొత్త ప్రణాళికలను సిద్ధం చేసుకుని మనం ముందంజ వేయవలసిన తరుణం యిది. మన రెండు తెలుగు రాష్ట్రాలలో కొంచెం అటూ యిటుగా ఒకేసారిగా కొత్త ప్రభుత్వాలు కొలువు తీరాయి. కేంద్రంలో తిరిగి నరేంద్రమోదీ ప్రభుత్వమే ఏర్పడినా, అది యితర పార్టీలపై ఆధారపడి పని చేయవలసిన సంకీర్ణ ప్రభుత్వం కావడం కూడా ఆశించే ఫలితాలను సాధించుకోవడానికి కొంత సానుకూలమే. ఇక ఎన్నికల ముందు యిచ్చిన హామీలను నెరవేర్చడానికి ఉభయ రాష్ట్ర ప్రభుత్వాలు పోటాపోటీగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తాయి. ముఖ్యంగా రైతులకు, మహిళలకు ప్రయోజనం కలిగించే చర్యలను ఈ ప్రభుత్వాలనుంచి ఆశించవచ్చు. తెలంగాణా ప్రభుత్వం రైతుల రుణాల మాఫీని ప్రకటించడం ఈ కోవలోనిదే. అటు కేంద్ర బడ్జెట్‌లో కూడా వ్యవసాయ రంగానికి, గ్రామీణాభివృద్ధికి, మహిళా సంక్షేమానికి, భారీగా నిధులు కేటాయించారు. ఇంతే కాకుండా 2025వ సంవత్సరాన్ని అంతర్జాతీయ సహకార సంస్థల సంవత్సరంగా ప్రకటించడం కూడా మనకు మరో మంచి అవకాశం. ఇలా మనకు అనేక సానుకూలాలు కలసి వస్తున్నాయి. అయితే, వాటిని సద్వినియోగం చేసుకోవడం మన ముందున్న ముఖ్య కర్తవ్యం. వివిధ పథకాలు, కార్యక్రమాలకు అనుగుణంగా తగిన ప్రణాళికలను ఎఫ్ పి ఓలు, మహిళా స్వయంసహాయ సమాఖ్యలు రూపొందించుకుని, వాటిని నెరవేర్చుకోవడానికి గట్టి కృషిచేయడం ఎంతైనా అవసరం. సరికొత్త అవకాశాలకు దీటైన ధోరణిలో ప్రతిపాదనలను, ప్రణాళికలను వీలున్నంత త్వరగా సిద్ధం చేసుకుని, ప్రయోజనం పొందడానికి ప్రయత్నించాలి. ఈ విషయంలో ఎఫ్ పి ఓల సి ఇ ఓలు, పాలక వర్గాలు తగిన అవగాహనతో చొరవ చూపాలి. 'మంచి తరుణం మించిన దొరకదు' అనే పెద్దల మాటను పెడచెవిన పెట్టకూడదు సుమా! ఈ సానుకూలాలతో పాటు ప్రకృతి కూడా కొంత సహకరిస్తున్నట్టు కనిపిస్తుంది. ఉభయ తెలుగు రాష్ట్రాలలోను ఈ వానాకాలంలో చెప్పుకోదగిన స్థాయిలో వర్షపాతం నమోదు కావడం సంతోషదాయకమైన విషయం. ఇటు సాగు పనులతో పాటు, కొత్త అవకాశాలను చక్కగా వినియోగించుకుని, ప్రయోజనం పొందే దిశగా మన ప్రయత్నాలు ముమ్మరంచేయాలి. ఆ దిశగా ఎఫ్ పి ఓలు, స్వయంసహాయ సంఘాలు, సమాఖ్యలు ముందడుగు వేయాలని, మంచి ఫలితాలు సాధించాలని ఆశిద్దాం!




Edited, Printed, Published and owned by **T.Chandra Sekhar Reddy;** Printed at Kala Jyothi Process Pvt.Limited, S No:185, Kondapur, Hyderabad-500133, Ranga Reddi District, Telangana;Published at Mahila Abhivruddhi Society, Andhra Pradesh (APMAS), Plot No.11&12,HUDAColony, Tanesha Nagar, Near DreamVally,Manikonda,Rangareddi District,Hyderabad-500089. **Editor:T.Chandra Sekhar Reddy**


ఆయినవారి మౌనం గుండెల్లో గునపం , అందుకే మాటామంతీ కొనసాగిస్తుండాలి

# మహిళా సాధికారత


ఎడిటర్ : **టి.చంద్రశేఖర రెడ్డి** అసోసియేట్ ఎడిటర్ : **జె.వి. క్రిష్ణమూర్తి**

ఎడిటోరియల్ కమిటి: ఎన్ వినాయక రెడ్డి, ఎల్. భవాని, ఎం. భార్గవి, జి. శ్రీనివాస్, కె శ్రీనివాస్, ఆర్ బ్రహ్మాచారి, ఎస్. ప్రహ్లాదయ్య

కంపోజింగ్, డిజైనింగ్ : ఎన్. రమాదేవి , కన్సల్టెంట్: కె. రఘురామరాజు

సమన్వయ సహకారం : పి. ఝాన్సీ లక్ష్మి, సాంకేతిక సహకారం: బి మౌళి


## లోపలి పేజీలలో ....


- భవ్యభవితకు ఏపిమాస్ వార్షికోత్సవ మార్గనిర్దేశం 05
- ఎఫ్ పి ఓల సి ఇ ఓలకు వ్యాపార శిక్షణ ! 08
- ఇంటి పంటతో ఆరోగ్యం, ఆహ్లాదం ! 09
- జాతీయస్థాయి సమాఖ్యలపై ఏపిమాస్ శిక్షణ 10
- కిశోర బాలబాలికలకు ఆరోగ్య పరీక్షలు 12
- వానాకాలంలో ఆరోగ్యకర ఆహారం 13
- తెలంగాణాలో పంట రుణాల మాఫీ 14
- లెప్రా సొసైటీ సి.బి.ఓ లకు ఏపిమాస్ శిక్షణ 15
- నిర్మల్‌లో జిల్లా స్థాయి 'వాష్' కార్యశాల 16
- సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో తెలుగురాష్ట్రాలు 18
- ప్రకృతి వ్యవసాయంతోనే పర్యావరణ పరిరక్షణ 20
- భూముల వివాదాలను నివారించే 'భూ ఆధార్' 23
- కౌలు రైతుల కష్టాల కడగండ్లు తీరినట్టేనా ? 24
- పది రెట్లు ఆదాయం అందించే వెదురు సాగు! 25
- ఏపిలోమహిళలకు 5 లక్షల రుణం 26
- మానవాళికి ఎక్కువ మేలుచేసే చెట్లు యివే! 27
- ప్రకాశం జిల్లా డ్వామా పీడీపై విచారణ 28
- తెలంగాణాలో రెట్టింపుగా చిరుధాన్యాల సాగు! 29
- మహిళలకు కొనే ఆస్తులపై తగ్గనున్న సుంకం! 30
- రక్తంలో కొలెస్ట్రాల్ నియంత్రణకు మార్గదర్శకాలు 31
- ఉచిత గ్యాస్ సిలిండర్ల కోసం ఇలా చేయండి! 32
- వర్షాకాలం వ్యాధులను తెస్తుంది ..బహుపరాక్ 33
- తెలంగాణాలో ఇక ఊరూరా 'మీసేవ' కేంద్రాలు 34


## 'మహిళాభివృద్ధి సొసైటీ' (ఏపిమాస్)

'మహిళా సాధికారత' పత్రిక మాతృసంస్థ మహిళాభివృద్ధి సొసైటీ. దీనిని ఏపిమాస్ అని, మాస్ అని కూడా సంక్షిప్తంగా పిలుస్తారు. 2001జూన్ 14 వ తేదీన పబ్లిక్ సొసైటీగా మహిళాభివృద్ధి సొసైటీ హైదరాబాద్ ప్రధాన కార్యాలయంగా ఏర్పాటైంది. తెలుగు రాష్ట్రాలలో, మన దేశం లోని ఇతర అనేక రాష్ట్రాలలో మహిళా స్వయంసహాయ సంస్థల సుస్థిరాభివృద్ధికి విశేష సేవలను అందించిన ఈ సంస్థ ప్రస్తుతం రైతుల అభ్యున్నతికి, పర్యావరణ పరిరక్షణకు, ఆదర్శ గ్రామాల నిర్మాణానికి, స్వయంసహాయ సంస్థల స్వయం నియంత్రణకు గణనీయమైన కృషి చేస్తున్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ప్రధాన కార్యదర్శిగా పనిచేసి పదవీ విరమణ చేసిన శ్రీ కె. మాధవరావు ఛైర్మన్‌గా వివిధ రంగాలలో విశేషానుభవం గడించిన ప్రముఖులు ఈ సంస్థ పాలకవర్గంలో వున్నారు. సంస్థ వ్యవస్థాపక సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి ఎండి గా, సిఇఓ గా వున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, బీహార్‌లలో కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఈ సంస్థకు ప్రధాన కార్యాలయంతోపాటు, ఒక ప్రాంతీయ కార్యాలయం, 21 క్షేత్ర కార్యాలయాలు వున్నాయి. దాదాపు 250 మందికి పైగా సిబ్బంది వున్నారు. ప్రజలకు అవగాహన కలిగించడంకోసం 'మహిళా సాధికారత 'పత్రికతోపాటు వివిధ వైజ్ఞానిక పుస్తకాలను, ఈ సంస్థ ప్రచురిస్తుంటుంది.


| ప్రోత్సాహక చందా | | |
|---|---|---|
| ఏడాదికి | : | రూ. 110 |
| రెండేళ్ళకు | : | రూ. 200 |
| మూడేళ్ళకు | : | రూ. 280 |

| ప్రకటన ఛార్జీలు | |
|---|---|
| మల్టీకలర్ ఫస్ట్ పేజి (సగం)/బ్యాక్ పేజి(పూర్తి) | : రూ. 25,000 |
| మల్టీకలర్ ఇన్‌సైడ్ కవర్ పేజి (పూర్తి) | : రూ. 15,000 |
| బ్లాక్ అండ్ వైట్ లోపలి పేజి (పూర్తి) | : రూ. 10,000 |

**చందాలు లేదా ప్రకటనలకోసం పంపే డిడిలను 'ఏపిమాస్ -హైదరాబాద్' పేరుమీద పంపాలి**

మహిళా సాధికారత, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్, డ్రీమ్‌వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089. ఫోన్ : 08413-403118
Web: www.apmas.org, E Mail: info@apmas.org


ఆశాభావం అన్నిటినీ అనుకూలంగా మార్చే మంత్రదండం కాదు, దేనికైనా నిన్ను సిద్ధంచేసే మనోబలం !

# భవ్య భవితకు ఏపిమాస్ వార్షికోత్సవ మార్గ నిర్దేశం!




రెండు దశాబ్దాలు, ఆపై మూడు వసంతాలు. నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో స్వయంసహాయ రంగానికి వెన్నుదన్నుగా ప్రభుత్వ ప్రోత్సాహంతో ఒక ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థ ఊపిరి పోసుకుని, తన విశిష్ట సేవలతో 'ఇంతింతై వటుడింతై' అన్నట్టు స్వయంసహాయ రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రభాగాన నిలవడానికి తన వంతు దోహదం చేసి, ఇతర రాష్ట్రాలకు కూడా తన నాణ్యమైన సేవలను అందించి, అంతర్జాతీయ స్థాయికి కూడా ఎదిగి, ప్రగతి పథానికి మారుపేరుగా నిలచిన ఉజ్వల ఘట్టం ఆవిష్కృతమైనది ఆ 23 ఏళ్ళ క్రితమే! ఆ సంస్థే 'ఏపిమాస్' అని ప్రఖ్యాతి పొందిన 'మహిళాభివృద్ధి సొసైటి, ఆంధ్రప్రదేశ్'!

స్వయంసహాయ వ్యవస్థతో తన ప్రగాఢ అనుబంధాన్ని కొనసాగిస్తూనే, కాలానుగుణమైన సామాజిక పరిస్థితులకు, పరిణామాలకు, అనుగుణంగా, ఎప్పటికప్పుడు తన సేవలను విస్తరించుకుంటూ, జీవనోపాధుల పెంపుదల, ఆదర్శ గ్రామాల నిర్మాణం, మహిళలు, కౌమార బాలికల ఆరోగ్య సంరక్షణ, పోషకాహారం, నీరు, పారిశుధ్యం, పర్యావరణ పరిరక్షణ, వ్యవసాయరంగాభివృద్ధి, ఎఫ్ పి ఓల అభివృద్ధితో రైతుల జీవన వికాసం, పాఠశాలలలో విద్యార్థులకు మౌలిక వసతుల కల్పన మొదలైన వివిధ రంగాలలో తనదైన విశిష్ట ముద్ర వేసిన ఏపిమాస్ 2024 జులై 1, 2 తేదీలలో తన 23వ వార్షికోత్సవాన్ని హైదరాబాదులోని సంస్థ ప్రధాన కార్యాలయంలో ఘనంగా నిర్వహించుకున్నది.

అభివృద్ధి రంగానికి చెందిన పలువురు ప్రముఖులు ఈ వార్షికోత్సవంలో పాలుపంచుకుని, అభినందన సందేశాలతో పాటు, ఏపిమాస్ మరిన్ని ఎత్తులకు ఎదగాలని, మరెన్నో రంగాలకు విస్తరించాలని, యింకా ఎందరెందరికో తన సేవలను అందించాలని ఆకాంక్షించారు. ప్రార్థన, జ్యోతి ప్రజ్వలనతో మొదటి రోజు వార్షికోత్సవ సంరంభం ప్రారంభమైంది. ముందుగా ఏపిమాస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీమతి రామలక్ష్మి అందరికీ స్వాగతం పలికారు.

ఏపిమాస్ వ్యవస్థాపక సి ఇ ఓ, ఎండి శ్రీ సి ఎస్ రెడ్డి తన స్వాగతోపన్యాసంలో 23 ఏళ్ళ ఏపిమాస్ ప్రస్థానాన్ని క్లుప్తంగా వివరించి, ఈ ప్రగతి గమనంలో భాగస్వాములైన సంస్థలకు, వ్యక్తులకు అందరికి ధన్యవాదాలు తెలిపారు. డి జి ఆర్ వి–జర్మని, ఏ ఇ ఐ ఎన్–లక్సెంబర్గ్, నాబార్డ్, ఎస్ ఎఫ్ ఏ సి, ఎన్ సి డి సి, మానేజ్, ఇర్మా, వామ్నికోమ్, సి ఎస్ ఆర్, సమున్నతి, ఎఫ్ డబ్ల్యు డబ్ల్యు బి, నార్మ్, కేటలిస్ట్ గ్రూప్, వృత్తి వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, బ్యాంకులు, ప్రభుత్వ శాఖల వంటి 36 వైవిధ్య భాగస్వాములతో ఏపిమాస్



అనుబంధం కలిగి వున్నట్టు శ్రీ సి ఎస్ రెడ్డి తెలిపారు.

ఈ రెండు రోజుల కార్యక్రమంలో ఏపిమాస్ ప్రస్తుత అభివృద్ధి స్థాయిని సమీక్షించడంతో పాటు, రాబోయే సంవత్సరాలలో ఇతోధిక ప్రగతి సాధనకు నిర్దేశించుకోవలసిన లక్ష్యాలు, అనుసరించవలసిన మార్గాలను, వ్యూహాలను, సాధించవలసిన ఫలితాలను గురించి నిశితంగా ఆలోచించాలని శ్రీ సి ఎస్ రెడ్డి సిబ్బందికి మార్గదర్శనం చేశారు. 2025 వ సంవత్సరం అంతర్జాతీయ సహకార సంస్థల సంవత్సరంగా జరుపుకుంటున్నందువల్ల ఆ సంవత్సరాన్ని ఏపిమాస్ ఎలా జరుపుకోవాలో కూడా ప్రణాళిక రూపొందించాలని శ్రీ సి ఎస్ రెడ్డి కోరారు.

అనంతరం ఏపిమాస్ పాలకవర్గం సభ్యులు శ్రీ ఎన్ వి రమణ ఏపిమాస్ మూల బలాలను గుర్తు చేస్తూ, సహ భాగస్వాములతో సంఘటిత కృషితో ఎఫ్ పి ఓలను సుస్థిరాభివృద్ధి సాధక వ్యాపార సంస్థలుగా తీర్చిదిద్దగలిగే శక్తి సామర్థ్యాలు ఏపిమాస్‌కు పుష్కలంగా వున్నాయని, అందువల్ల ఏపిమాస్ ఈ కృషికి నేతృత్వం వహించాలని కోరారు.

ఏపిమాస్ పాలకవర్గం వైస్ ఛైర్ పర్సన్ మహాపర అలీ గారు ఏపిమాస్ ప్రస్థానంలో తన అనుబంధాన్ని ప్రస్తావిస్తూ, పేదలు, బడుగు, బలహీన వర్గాల ప్రజల సమగ్రాభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్న ఏపిమాస్‌లో తానూ భాగస్వామిగా వున్నందుకు గర్విస్తున్నాని అన్నారు.

**సానుకూల ప్రతికూలాలపై చర్చ**

అనంతరం ఏపిమాస్‌కు వ్యూహాత్మక సహకారం అందిస్తున్న 'సోషల్ వెంచర్ పార్ట్నర్స్' ప్రతినిధులు శ్రీ కొల్లి సుబ్బారావు, శ్రీ పాపారావు ఏపిమాస్ సిబ్బంది వ్యక్తిత్వ వికాసానికి, లక్ష్య సాధనకు అవసరమైన సామర్థ్య నిర్మాణానికి కొన్ని ప్రయోగాత్మక ప్రక్రియలను ప్రెజెంటేషన్ల రూపంలో నిర్వహించారు. ప్రగతిశీల ఆలోచనా విధానం, మార్పులేని ఆలోచనా ధోరణి మధ్య వ్యత్యాసాన్ని వివరించారు. సిబ్బందిని కొన్ని బృందాలుగా విభజించి ఏపిమాస్ నిర్వహణలో వారు గమనించిన సానుకూల, ప్రతికూల అంశాలను, అనుసరించ వలసిన మార్పుచేర్పులను వారిచే చెప్పించారు.

అనంతరం అదే 'సోషల్ వెంచర్ పార్ట్నర్స్' కు చెందిన శ్రీ రామ్ కౌండిన్య 2030 నాటికి సాధించాలని ఏపిమాస్ నిర్దేశించుకున్న లక్ష్యాల దృష్ట్యా వచ్చే మూడేళ్ళ కాలంలో ఏపిమాస్ ఎటువంటి చర్యలు చేపట్టాలో సిబ్బంది అభిప్రాయాలను తెలుసుకునే ప్రయత్నం చేశారు.

అనంతరం ఏపిమాస్ పాలకవర్గ సభ్యులు శ్రీ మోహనయ్య ఏపిమాస్‌తో తన అనుబంధాన్ని వివరిస్తూ, సిబ్బంది అందరూ సంఘటిత కృషితో ఏపిమాస్ నిర్దేశించుకున్న లక్ష్య సాధనకు కృషి చేయాలని కోరారు.

తరువాత సిబ్బంది ఆటపాటలతో వార్షికోత్సవం తొలిరోజు కార్యక్రమాలు పూర్తయ్యాయి.

**రెండవరోజు కార్యక్రమాలు**

ముగ్గురు ప్రముఖ వ్యక్తుల సందేశాలు ఏపిమాస్ 23 వ వార్షికోత్సవం రెండవ రోజును ఎంతో ప్రభావితం చేశాయి. వీరు: క్యాటలిస్ట్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ (సి ఎం ఎస్) కు చెందిన శ్రీ శివ కుమార్, ఏపిమాస్ ఏర్పాటులో కీలక పాత్ర వహించిన, భారత అభివృద్ధిరంగ పితామహుడుగా పేరొందిన శ్రీ విజయ్ మహాజన్, సుదీర్ఘ కాలంగా ఏపిమాస్ పాలకవర్గ సభ్యులు, తెలంగాణా ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఐ ఏ ఎస్ అధికారి శ్రీ జయేష్ రంజన్. శ్రీ శివకుమార్ పరోక్షంగా జూమ్ మీటింగ్ ద్వారా పాల్గొని తన సందేశాన్ని వినిపించగా, శ్రీ విజయ్ మహాజన్, శ్రీ జయేష్ రంజన్ నేరుగా వార్షికోత్సవంలో పాల్గొన్నారు.

ముందుగా శ్రీ శివకుమార్ ప్రసంగిస్తూ, ఏపిమాస్‌కు వున్న అవకాశాలేమిటి, ఆ అవకాశాలను ఉపయోగించుకుని తన లక్ష్య సాధనకు ఏపిమాస్ ఎలా కృషి చేయగలుగుతుంది, సవాళ్ళను ఎలా ఎదుర్కొంటుంది అనే అంశాలను ప్రస్తావిస్తూ,





వివిధ భాగస్వాములతో పటిష్ఠమైన భాగస్వామ్యాలను కలిగి వుండడం, కార్యక్రమాల అమలుకు అవసరమైన నిధుల సేకరణకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడం ద్వారా సవాళ్ళను అధిగమించాలని సూచించారు.

**ఐదు సంపదలు, మూడు శక్తులు**

అనంతరం ప్రసంగించిన శ్రీ విజయ్ మహాజన్ ప్రారంభానికి పూర్వం నుంచి ఏపిమాస్‌తో తనకు వున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఏపిమాస్ ఐదు ప్రత్యేక సంపదలపై దృష్టి కేంద్రీకరించాలని ఆయన సూచించారు. అవి: ప్రకృతి సంపద, భౌతిక సంపద, సామాజిక సంపద, ఆర్థిక సంపద, మానవ సంపద అని ఆయన తెలిపారు.

పేద, బడుగు వర్గాలవారు నీరు, భూమి, అటవీ హక్కులు సాధించుకోవడానికి ఏపిమాస్ వారికి అండగా నిలవాలని ఆయన అన్నారు. పేదల అభ్యున్నతికి అంకిత భావంతో కృషి చేయాలంటే, సమాచారం, విశ్వాసం, సంఘటితత్వం అనే మూడు శక్తులు అవసరమని శ్రీ మహాజన్ చెప్పారు. 'ఎన్ ఇ డబ్ల్యు' సూత్ర ప్రాతిపదికపై సమాజాన్ని బలోపేతం చేయాలని ఆయన చెప్పారు. ఈ ఆంగ్ల అక్షరాలు ఎన్ – ప్రకృతి సంపదను, ఇ–పారిశ్రామిక, వ్యాపారాత్మక దృష్టి, డబ్ల్యు– సంక్షేమం అని ఆయన నిర్వచనం చెప్పారు. ఏపిమాస్ తన నిర్దేశిత లక్ష్య సాధనలో ఈ సూత్రాలను పాటించాలని శ్రీ విజయ్ మహాజన్ హితవు చెప్పారు.

తర్వాత ప్రసంగించిన శ్రీ జయేష్ రంజన్ ఏపిమాస్‌తో తన సుదీర్ఘ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. భాగస్వాములతో కలసి ఏపిమాస్ సాధించిన ప్రగతి గణనీయమైనదని, ఈ ప్రస్థానంలో ఏపిమాస్ ఎంతగానో సామర్థ్య నైపుణ్యాలను సంతరించుకున్నదని ఆయన అన్నారు. ఇంకా సాధించవలసిన వాటిని ఎలా సాధించాలనే విషయమై ఏపిమాస్ దృష్టి కేంద్రీకరించాలని, పేదల జీవితాలను మెరుగుపరచడంకోసం వారి ఆరోగ్యం, పోషకాహారం, విద్య, జీవనోపాధుల పెంపుదల అనే అంశాలకు ప్రాధాన్యం యివ్వాలని శ్రీ జయేష్ రంజన్ హితవు చెప్పారు.

అనంతరం శ్రీమతి కళామణి మొదటి రోజున వివిధ బృందాలు పేర్కొన్న అంశాలను క్రోడీకరించారు. తర్వాత 2026 నాటికి నిర్దేశించుకున్న లక్ష్యాల సాధనకు అనుసరించ వలసిన మార్గాలను సూచించడానికి సిబ్బందిని ఐదు బృందాలుగా విభజించి వారితో చర్చింపజేశారు.

ఈ దశలో ఏపిమాస్ ఛైర్మన్ శ్రీ మాధవరావు సమావేశానికి హాజరై చర్చల తీరును గమనించారు.

మహిళా సాధికారత పత్రిక ప్రచురణలో సిబ్బంది సహకారాన్ని గురించి, అనుసరించవలసిన పద్ధతుల గురించి అసోసియేట్ ఎడిటర్ శ్రీ జె వి క్రిష్ణమూర్తి కొన్ని సూచనలు చేశారు.

అనంతరం గ్రూప్ ఫోటోతో రెండు రోజుల వార్షికోత్సవ సమావేశాలు ఆనందోత్సాహాలతో, లక్ష్య సాధనకు పునరంకిత దీక్షతో ముగిశాయి.

■



ఇతరులు చూడలేనిదానిని చూడగలగడమే దార్శనికత్వం, సాధించడమే సామర్థ్యం

# ఎఫ్ పి ఓల సి ఇ ఓలకు వ్యాపార శిక్షణ !

– జి. శ్రీనివాసరెడ్డి

**ఎఫ్** పి ఓల వ్యాపార సామర్థ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో 2024 **జులై** 10–12 తేదీల మధ్య, 'వ్యవసాయ పరిశోధనల నిర్వాహక జాతీయ సంస్థ' (నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ …నారమ్) యిప్పటికే ప్రాథమిక శిక్షణ పొందిన ఎఫ్ పిఓల (వ్యవసాయ ఉత్పత్తిదారుల సంస్థల) కార్యనిర్వహణాధికారుల (సీఈఓల) కోసం పునశ్చరణ శిక్షణ (రిఫ్రెషర్ ట్రెయినింగ్) కార్యక్రమాన్ని నిర్వహించింది. ఎఫ్ పి ఓల కార్యనిర్వహణాధికారులకు యిచ్చే 'అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ 'శిక్షణ (ఏబిఎండిపి)లో భాగంగా ఈ పునశ్చరణ శిక్షణను నిర్వహించింది. ఈ కార్యక్రమాన్ని నాబార్డ్ ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ కార్యాలయం మద్దతుతో నారమ్ (ఎన్ ఎ ఎ ఆర్ ఎం)సంస్థ, సాంకేతిక వ్యాపార అంకుర (టెక్నాలజీ బిజినెస్ ఇన్క్యుబేటర్ …టిబిఐ) సంస్థ 'ఎ–ఐడియా' ఆధ్వర్యంలో జరిగింది.

ఈ పునశ్చరణ శిక్షణను 2024 జులై 13న నాబార్డ్ తెలంగాణ ప్రాంతీయ కార్యాలయం చీఫ్ జనరల్ మేనేజర్ శ్రీమతి సుశీల చింతల ప్రారంభించారు. నాబార్డ్ మద్దతుతో భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసిఏఆర్) అనుబంధ సంస్థ అయిన 'నారమ్'ఈ కోర్సును నిర్వహించింది.

అభ్యర్థుల్లో విశ్లేషణాత్మక, నిర్ణయాత్మక, సమస్యా పరిష్కార శక్తులను పెంపొందించడం, వ్యాపార సామర్థ్యాలను అభివృద్ధి చేయడం, వారికి వ్యవసాయ వ్యాపార నిర్వహణ (ఏ బి ఎం) దృక్కోణాలను, వ్యాపార సామర్థ్యాలను అలవరచడం ఈ పునశ్చరణ శిక్షణ ప్రధాన లక్ష్యం. తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో ఎఫ్‌పిఓల కోసం సీఈఓలుగా శిక్షణ పొందిన అభ్యర్థులలో ఇప్పటివరకు, రెండు బ్యాచ్‌లలో 60 మంది ఈ కోర్సును పూర్తి చేసి సర్టిఫికెట్లు పొందారు.

ఇప్పటికే ప్రాథమిక శిక్షణ పొందిన సీఈఓల నైపుణ్యాలను మరింత పెంపొందించడానికి, శిక్షణలో ఉన్న లోటుపాట్లను పరిష్కరించడానికి, సమర్థవంతమైన మార్గదర్శకత్వం ద్వారా సాంకేతిక సవాళ్ళను ఎదుర్కొనే విధంగా వారిని తీర్చిదిద్దడానికి ఈ పునశ్చరణ శిక్షణ దోహదం చేస్తుంది.

**శిక్షణలోని ప్రధాన అంశాలు**

**1. అకౌంటింగ్, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్** : ఎఫ్‌పిఓలకు (వ్యవసాయ ఉత్పత్తిదారుల సంస్థలకు) ప్రత్యేకంగా ఉన్న అకౌంటింగ్ అవసరాల, ఆర్థిక వ్యవహారాల నిర్వహణ కోసం



ట్యాలీ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించడంపై ఏపిమాస్ ఫైనాన్స్ డైరెక్టర్ శ్రీ జి. శీనివాసరెడ్డి ఈ కోర్సులో శిక్షణ అందించారు. సీఈఓలు వారి వృత్తిని కేవలం జీవనోపాధిగా భావించకుండా, ఎఫ్‌పిఓలోని 500కు పైగా రైతుల తరపున ప్రతినిధిగా వ్యవహరించాలని ఆయన సీఈఓలకు సూచించారు. అకౌంటింగ్ ప్రధాన సూత్రాలను, ట్యాలీ సాఫ్ట్‌వేర్‌లోని మెళుకువలనుపయోగించి స్టాక్ నిర్వహణ, కొనుగోళ్లు, అమ్మకాలు నగదు, బ్యాంక్ లావాదేవీల నిర్వహణపై ఆయన శిక్షణ అందించారు. ఎ–ఐడియా ప్రతినిధి శ్రీ సత్యేంద్ర కుమార్ ఈ క్రింది అంశాలపై సిఈఓలకు అవగాహన కల్పించారు.

**2. వ్యాపార ప్రణాళిక రచన, వ్యాపారాభివృద్ధి :** ఎఫ్‌పిఓల సుస్థిరాభివృద్ధి కోసం సమర్థవంతమైన వ్యాపార ప్రణాళిక, మార్కెట్ విశ్లేషణ, వనరుల నిర్వహణ రీతులు.

**3. నాయకత్వం, పాలన:** ఎఫ్‌పిఓలను సమర్థవంతంగా ,



నైతికంగా నడిపించడానికి నాయకత్వ నైపుణ్యాలను, పాలనా పద్ధతులను పెంపొందించడం.

**4. స్టార్టప్ –ఎఫ్‌పిఓ పరస్పర సహకారాలు :** ఐసిఎఆర్ – నారమ్ డైరెక్టర్, ఎ-ఐడియా అధ్యక్షుడు డాక్టర్ సిహెచ్ శ్రీనివాసరావు, దేశవ్యాప్తంగా వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయడానికి ఎఫ్‌పిఓల ప్రాముఖ్యతను వివరించారు. రైతుల సంపూర్ణ అభివృద్ధిని ప్రోత్సహించడానికి స్టార్టప్–ఎఫ్‌పిఓ పరస్పర సహకార ప్రాముఖ్యతను ఆయన పేర్కొన్నారు.

శిక్షణ ముగింపు సమావేశానికి ప్రధాన అతిథిగా హాజరైన నాబార్డ్ ఏపీ చీఫ్ జనరల్ మేనేజర్ శ్రీ. ఎం.ఆర్. గోపాల్, భారతదేశంలో ఎఫ్‌పిఓలను ప్రోత్సహించడంలోను, ఆంధ్రప్రదేశ్‌లో రైతు సంఘాలను అభివృద్ధి చేయడంలో ఏపీ నాబార్డ్ పాత్రను ఆయన ప్రశంసించారు. ఆయన ఎఫ్‌పిఓల సీఈఓల కోసం శిక్షణ సూచికను ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎఫ్‌పిఓల అభివృద్ధి కోసం నాబార్డ్ పలు కార్యక్రమాలను అమలు చేయడం ద్వారా నిరంతర మద్దతు అందిస్తుందని హామీ ఇచ్చారు.

ఎ-ఐడియా సీఈఓ, ఐసిఎఆర్–నారమ్‌లో ఇఎస్ఎం డివిజన్ ప్రధాన అధికారి డాక్టర్ ఎస్. సెంథిల్ వినాయగం, కార్యక్రమ ఫలితాలను, క్షేత్ర స్థాయిలో శిక్షణ పొందిన సీఈఓల కార్యకలాపాలను వివరించారు.

ఈ కార్యక్రమంలో మొత్తం 22మంది ఎఫ్‌పిఓల సీఈఓలు, 10 స్టార్టప్‌ల ప్రతినిధులు పాల్గొన్నారు. వీరు స్టార్టప్–ఎఫ్‌పిఓ పరస్పర సహకార ప్రాముఖ్యతను గురించి, అవసరమైన వ్యాపార మెళుకువల గురించి, ఎఫ్‌పిఓల అకౌంటింగ్ అవసరాలను తీర్చడంలో ట్యాలీ వినియోగం గురించి నేర్చుకోవడంలో ఉత్సుకతను ప్రదర్శించారు. ■

## ఇంటి పంటతో ఆరోగ్యం, ఆహ్లాదం !

– ప్రత్యూష

మనందరికి ఆరోగ్యం తప్పనిసరి. ఆరోగ్యం లేని జీవితాలలో ఆనందం ఉండదు. కాబట్టి ఎవరికైనా ఆరోగ్యం తప్పనిసరి అనే విషయం అక్షర సత్యం. ఆరోగ్యంగా ఉండాలంటే మంచి గాలి, నీటితో పాటు మంచి ఆహారం తీసుకోగలగాలి. మన ఆరోగ్యం ప్రధానంగా ఈ మూడింటి పైనే ఆధారపడి ఉంటుంది. మంచి ఆహారం కావాలంటే సాధ్యమయినంత వరకు వేరే వారి మీద ఆధారపడకుండా తామే సొంతంగా పండించుకుని తింటేనే మంచి ఆహారం దొరుకుతుందనే పరిస్థితులు ప్రస్తుత సమాజంలో నెలకొన్నాయి. మనం తినే అన్ని రకాల ఆహారాలు అందరం పండించుకోలేము కాబట్టి ఎంతగా అవకాశం వుంటే అంతగా సొంతంగా పండించుకోవటానికి కొంతమంది ఔత్సాహికులు ప్రయత్నిస్తున్నారు. ఇలా ఇంటి పంటదారుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతూ ఉంది.

వివిధ రంగాలలో ఉన్నవారు ఎవరికి అవకాశం ఉన్నంత మేరలో వారు కొన్ని ఆహార మొక్కలు పెంచుకుంటున్నారు. ఇంట్లో మొక్కలు పెంచుకోవటం వలన ఆరోగ్యకరమయిన ఆహారం సొంతంగా పండించుకొని తినడంతోపాటు శారీరక శ్రమకు అవకాశం ఉంటుంది. అంతే కాకుండా ఇంటి పంటలో గడిపిన సమయం ఆహ్లాదంగా ఉంటుంది, మన శక్తి పెరుగుతుంది. మన రోజువారీ పనులలో సామర్థ్యం పెరిగి ఫలితాలు మంచిగా ఉంటాయనడంలో సందేహం లేదు.

ఈ ఆలోచనతో పీలేరు రైతు సంఘం ఏపిమాస్, ఆరోబిందో ఫార్మా ఫౌండేషన్ సహకారంతో పెరటి తోట విత్తనాలను (10 రకాలు) 500 మంది రైతులకు పంపిణీ చేసింది. ఇంతేకాకుండా, ఆ పంటల కోసం ఎలాంటి రసాయిక మందులు వాడకుండా, సేంద్రియ ఎరువులను వారిచే తయారు చేయించి ఉపయోగించడం జరుగుతున్నది. దీనివల్ల ఆర్యోగ్య కరమైన పంటలు లభిస్తాయని రైతులకు వివరిస్తున్నారు. ■

మన మనస్సు ఒక అయస్కాంతం ! మంచిని తలిస్తే మంచిని, చెడును తలిస్తే చెడును అది ఆకర్షిస్తుంది

# జాతీయస్థాయి ఆదర్శ సమాఖ్యలపై ఏపిమాస్ శిక్షణ

– జి. శ్రీనివాస్



సమాఖ్యల పరిపాలన, ఆర్థిక నిర్వహణ అంశాలపై 16-07-2024 నుండి 20-07-2024 వరకు ఐదు రోజుల పాటు ఆదర్శ స్వయం సహాయ సమాఖ్యలపై జాతీయస్థాయి శిక్షణ కార్యక్రమాన్ని ఏపిమాస్ నిర్వహించింది. హైదరాబాదులోని ఏపిమాస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ఈ శిక్షణకు ఆరు రాష్ట్రాల నుంచి ఏడు స్వచ్ఛంద సంస్థలకు చెందిన 16 మంది అభ్యాసకులు పాల్గొన్నారు.

ఐదు రోజుల శిక్షణ కార్యక్రమంలో నాలుగు రోజులపాటు శిక్షణతోపాటు, జనగాం జిల్లాలో ఒకరోజు క్షేత్ర సందర్శన ఏర్పాటు చేయటం జరిగింది.

శిక్షణ ప్రారంభం కార్యక్రమంలో శ్రీ జి. శ్రీనివాస్ ఏపిమాస్ చేస్తున్న కార్యక్రమాల గురించి వివరించారు. అభ్యాసకులు వారి సంస్థలలో సంఘాల, సమాఖ్యల కోసం చేస్తున్న కార్యక్రమాలను గురించి, ఆ కార్యక్రమాల నిర్వహణలో వారి అనుభవాలను పంచుకునే విధంగా వారితో మాట్లాడించారు.

ఏపిమాస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీమతి రామలక్ష్మి సమాఖ్య స్వరూప స్వభావాలను గురించి, రాష్ట్ర, దేశస్థాయి లోని వివిధ రకాల సమాఖ్యల గురించి వివరించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో సంఘాల, సమాఖ్యల ఏర్పాటు విధానాన్ని గురించి, సమాఖ్యల సమావేశం నిర్వహణ పద్ధతులపైన అవగాహన కల్పించారు. సంఘాలు, సమాఖ్యలు పాటించాల్సిన సహకార సూత్రాలు, నియమ నిబంధనలు, సహకార విలువల గురించి వివరించారు. సమాఖ్యల బలోపేతం కోసం ఈ సూత్రాలను ఏవిధంగా అమలుపర్చాలో తెలిపారు.

శ్రీ మురళి జాజున సమాఖ్యల అవసరం, ఉపయోగం అను అంశాలపై వివరించారు. సమాఖ్యల సంస్థాగత నిర్మాణం, మహాసభ, పాలకవర్గం, పదాధికారుల వివిధ బాధ్యతలపై అవగాహన కల్పించారు.

శ్రీ రవీందర్ గారు సమాఖ్య ల సభ్యుల ఆర్థిక విధానం, సభ్యుల జీవనోపాధులు, ఆర్థికవృద్ధి కోసం సమాఖ్యల పాత్ర అనే అంశలను వివరించారు.

రెండవరోజున శ్రీ శ్రీనివాస్ సమాఖ్యలలో వివిధ రకాల సమావేశాలు, వాటి నిర్వహణ పద్ధతుల గురించి, నాయకత్వం, వివిధ రకాల నాయకత్వ లక్షణాల గురించి, ఎన్నికల ప్రక్రియను గురించి సభ్యుల ద్వారా 'రోల్ ప్లే'

**తోడు లేకపోతే చిన్న ప్రయాణమైనా నరకమే, మనసుకు నచ్చిన తోడుంటే నరకంలోనైనా స్వర్గమే !**



డైరెక్టర్‌ను, వారి ముఖ్య సిబ్బందిని కలుసుకుని సమాఖ్యల విషయంలో ప్రభుత్వపరమైన అంశాల గురించి తెలుసుకునే అవకాశం కల్పించారు.

ఐదవ రోజున శ్రీ రవీందర్, శ్రీమతి రామలక్ష్మి, శ్రీ మురళి జాజున, శ్రీ శ్రీనివాస్ అభ్యాసకులు క్షేత్ర సందర్శనలో నేర్చుకున్న విషయాలపై చర్చించి, వారి సందేహాలను నివృత్తి చేశారు.

క్షేత్ర సందర్శనలో తాము తెలుసుకున్న విషయాలపై అభ్యాసకులు ప్రజెంటేషన్ యిచ్చారు.

అనంతరం శ్రీ మురళి జాజున గారు అంతర్గత నియంత్రణ అనే అంశంపైన, శ్రీ జి. శ్రీనివాస్‌రెడ్డి సమాఖ్యలలో చట్టపరమైన అంశాలపైన వివరించారు.

ఈ విధంగా ఐదు రోజుల పాటు జరిగిన శిక్షణ గురించి అభ్యాసకులు తమ అనుభవాన్ని వివరిస్తూ, శిక్షణ చాలా చక్కగా జరిగిందని కొనియాడారు, శిక్షణ ఇచ్చిన రిసోర్స్ పర్సన్‌లకు, శిక్షణ ఏర్పాటు చేసిన ఏపిమాస్ వారికి ధన్యవాదాలు తెలిపారు. ■

చేయించి వివరించారు.

శ్రీమతి రామలక్ష్మి స్వయం నియంత్రణ ఉద్యమం గురించి వివరిస్తూ, ఉద్యమం తీరుతెన్నులు, అమలు విధానం, నిర్వహించే కార్యక్రమాలను తెలియజేశారు.

శ్రీ మురళి జాజున సమాఖ్య ఆర్థిక పట్టికలను అర్థం చేసుకోవటం ఎలా అనే అంశం పై క్లుప్తంగా వివరించారు.

శిక్షణలో మూడవరోజు శ్రీమతి రామలక్ష్మి , శ్రీ మురళి జాజున సమాఖ్య ఆర్థిక పట్టికల గురించి పూర్తి స్థాయిలో వివరించారు.

శిక్షణ కార్యక్రమంలో భాగంగా శ్రీ మహేష్ అలగప్ప, శ్రీ శ్రీనివాస్ అభ్యాసకులందరు కలిసి ఒకరోజు క్షేత్ర సందర్శన కోసం జనగాం జిల్లా లింగాల ఘనపూర్ మండలంలోని సంఘాలు, గ్రామ సంఘాలు, మండల సమాఖ్య సభ్యులు, ప్రతినిధులతో సమావేశమై సంఘాలు, సమాఖ్యల నిర్వహణ విధానంపై అభ్యాసకులకు అవగాహన కల్పించారు.

జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్‌ను, జిల్లా అదనపు ప్రాజెక్ట్



# కిశోర బాలబాలికలకు ఆరోగ్య పరీక్షలు

ఏపిమాస్ పట్టణ పోషణ పథకం బృందం, హెల్పింగ్ హాండ్స్ ఫౌండేషన్ తో కలసి, గుడిమల్కాపుర్‌లోని జి.హెచ్.ఎస్ దేవాలిజం సింగ్ ప్రభుత్వ పాఠశాల, కుల్సుంపురా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8, 9, 10వ తరగతులకు చెందిన 130 మంది విద్యార్థినీ విద్యార్థులకు జులై 23, 24 తేదీలలో రెండు రోజులపాటు ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించింది.

హైదరాబాద్ జిల్లా విద్యాధికారిణి శ్రీమతి రోహిణి ఈ కార్యక్రమ నిర్వహణకు సహకరించారు.

ఈ శిబిరం ప్రధాన లక్ష్యం ఆరోగ్య సమస్యలను గుర్తించడం, పరిష్కరించడం, పోషకాహార పరమైన, ఆరోగ్య పరమైన అవగాహనను ప్రోత్సహించడం. ముఖ్యంగా కిశోర బాలికల ఆరోగ్య, పోషక అవసరాలపైన, రక్తంలో హిమో గ్లోబిన్ యెంత ఉంది, రక్తహీనత అంశాలపై దృష్టి కేంద్రీకరించడం కోసం ఈ శిబిరాన్ని నిర్వహించడం జరిగింది. శిబిరంలో దంత పరీక్షలు, కంటి సంరక్షణ , రక్త (హిమోగ్లోబిన్) పరీక్షలు నిర్వహించారు.

మొదటి రోజు గుడిమల్కాపూర్‌లోని జి.హెచ్.ఎస్ దేవాలిజం సింగ్ ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదువు తున్న 40 మంది అమ్మాయిలకు, 10 మంది అబ్బాయిలకు, 2వ రోజున కుల్సుంపురాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8-9వ తరగతులు చదువుతున్న 50మంది అమ్మాయిలకు, 30 మంది అబ్బాయిలకు పరీక్షలను నిర్వహించారు.

పళ్ళ మధ్య సందులు, చిగుళ్ళ వ్యాధులు, ఇతర దంత సమస్యలను గుర్తించడానికి దంత పరీక్షలను, కంటి సంబంధిత సమస్యలను గుర్తించడానికి కంటి పరీక్షలు నిర్వహించారు. కిశోర బాలురకు, బాలికలకు ఆరోగ్యం ,పోషక అవసరాలు చాలా ముఖ్యమైనవి.

ముఖ్యంగా కిశోర బాలికలలో రక్తహీనత, పోషక లోపాలు సాధారణ ఆరోగ్య సమస్యగా మారింది. సంపూర్ణ రక్త చిత్రం పరీక్షలు నిర్వహించడం ద్వారా, రక్తహీనత వ్యాప్తిని నిర్ధారించవచ్చు. తొందరగా గుర్తించడం వలన సమయానుకూల జాగ్రతలు తీసుకుని ఆహార మార్పులు చేసుకోవచ్చు. ఈ శిబిరాలు వారి ఆరోగ్య, పోషకావసరాలను గుర్తించి, పరిష్కరించే లక్ష్యంతో చేపట్టారు. ఇవి వారిలో విద్యాభ్యాస పాటవాన్ని, జీవన నాణ్యతను పెంపొందించ డానికి తోడ్పడతాయి. విద్యార్థినీ విద్యార్థుల ఆరోగ్యం, పోషకాహారం పైన తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు అవగాహన/శిక్షణలు నిర్వహించడం వలన విద్యార్థినీ విద్యార్థుల ఆరోగ్యం, పోషణ అలవాట్లు మెరుగుపడతాయి.

ఈ శిబిరాలను విజయవంతంగా నిర్వహించడానికి హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ బృందం, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, ఆశ వర్కర్స్, విద్యార్థుల సహకారం ఎంతో వుంది.

శిబిరంలో నిర్వహించిన పరీక్షల ఆధారంగా బాలురలో 11.1- 14.9% హిమోగ్లోబిన్ శాతం ఉన్నట్టుగా గుర్తించారు. 50-55% మంది కిశోర బాలికలలో రక్తహీనత (5.2-10.9%) ఉన్నట్టుగా గుర్తించారు. రక్తహీనత ఉన్న ప్రతి విద్యార్థికి ఆరోగ్యం , పోషకాహార సలహాలు త్వరలో సూచించడానికి పట్టణ పోషణ పథకం, సిబ్బంది తగు ఏర్పాట్లు చేస్తున్నారు.

**చదువులో రాణించడానికి దోహదం**

ఏపిమాస్ సి ఇ ఓ శ్రీ సి.ఎస్. రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులకు ఆరోగ్యం, పోషకాహార సలహాలు ఇవ్వడం వలన వారి ఆహారపు అలవాట్లు మెరుగుపడతాయని వివరించారు. ఈవిధమైన ఆరోగ్య శిబిరాలను తరచుగా నిర్వహించి మరింత మంది విద్యార్థులకు పోషకాహార సలహాలు చేరవేయాలని, తద్వారా, ప్రతి విద్యార్థి ఆరోగ్యవంతంగా ఉండి, విద్యలో రాణించగలుగుతారని ఆయన అన్నారు. ■

ఏమి అన్నావనేదానికంటె ఎలా అన్నావనేది ముఖ్యం, మనసును ఒప్పించినా నొప్పించినా అది మాటతీరే !

# వానాకాలంలో ఆరోగ్యకర ఆహారం

**వా**నలొచ్చాయంటే వాతావరణంలో చల్లదనమే కాదు.. ఇన్‌ఫెక్షన్లు కూడా వస్తాయి. జీర్ణసమస్యలు, దగ్గు, జలుబు ఈ సీజన్‌లో సులువుగా వస్తాయి. వానాకాలాన్ని ఎంజాయ్ చేయటమే కాదు.. హెల్తీ డైట్ కూడా అవసరం.

- ప్రొటీన్లు అధికంగా ఉండే నానబెట్టిన గింజల్ని తినాలి. బ్రేక్‌ఫాస్ట్ లేదా స్నాక్స్ సమయంలో వీటిని తీసుకుంటే వ్యాధినిరోధక శక్తి పెరుగుతుంది.
- ఈ కాలంలో పసుపు గొప్ప ఔషధం. యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉండే ఈ పసుపు వల్ల అలర్జీలు, ఇన్‌ఫెక్షన్లు దరిచేరవు. అందుకే గోరువెచ్చని నీళ్లలోనో, పాలల్లోనో మంచి పసుపు కలిపి నిద్రపోయే ముందు తాగితే చక్కని ఫలితం ఉంటుంది.
- విటమిన్–సి ఎక్కువగా ఉండే నిమ్మరసం తీసుకోవటం మంచిదే. సాధారణంగా ఎండాకాలం నిమ్మరసాన్ని తాగుతారు. అలాగే మాన్‌సూన్‌లోనూ ఇన్‌ఫెక్షన్లు రాకుండా ఉండటానికి ఇది ఉపకరిస్తుంది.
- బాదం, పిస్తా, జీడిపప్పు లాంటి బలవర్ధకమైన నట్స్‌ను ఈ కాలంలో తినాలి. సులువుగా జీర్ణం అవ్వటంతో పాటు బలాన్ని, ఇమ్యూనిటీ పవర్‌ను ఇస్తాయవి.
- ఈ కాలంలో చిరుతిండ్లకు బంద్ చెప్పటం మంచిదే. వెజిటేబుల్ సూప్, చికెన్ సూప్‌లాంటివి తాగటం వల్ల ఉపశమనంతో పాటు ఆరోగ్యానికీ మంచిదే.
- హెర్బల్‌టీని ప్రిఫర్ చేయటం ఈ కాలంలో మరీ మంచిది.
- తాజా కూరగాయలతో పాటు తాజా పండ్లను తినాలి. దీనివల్ల వైరల్ ఇన్‌ఫెక్షన్లు రావు.
- మెంతిపప్పు, మెంతికూర తింటే శరీరానికి బూస్టర్‌లా పని చేస్తుంది.
- కోడిగుడ్డుతో పాటు ఒమేగా ఫాటీయాసిడ్స్ ఉండే చేపలను తినటం వల్ల ఆరోగ్యానికి మేలు చేకూరుతుంది.
- అల్లంటీ, వెల్లుల్లి వేసిన ఆహారం తినటం వల్ల గొంతు ఇన్‌ఫెక్షన్లు, కడుపులో సమస్యలు పోతాయి.
- అతిగా మసాలా ఉండే పదార్థాలు, ఎక్కువగా నాన్‌వెజ్ తినటం లాంటి ఈ కాలంలో మంచిది కాదు. దప్పిక తక్కువ ఉన్నా మంచి నీళ్లను బాగా తాగాలి. గోరువెచ్చని నీళ్లను తాగితే మరీ మంచిది.

వానాకాలంలో చర్మవ్యాధులు బారిన పడుతుంటారు. స్కిన్ ఎలర్జీలు, పగుళ్లు, దద్దుర్లు వస్తుంటాయి. ఇలాంటి సమయంలో అందం కాపాడుకోవాలంటే కొన్ని చిట్కాలు పాటించాల్సిందే..

- వర్షాకాలంలో తడవటం వల్ల జుట్టు పాడవుతుంది. కుదుళ్లు దెబ్బతింటాయి. వాతావరణ కాలుష్యం వల్ల చినుకుల్లో ఇతర రసాయన పదార్థాలు కూడా ఉంటాయని మర్చిపోకూడదు. అందుకే వానల్లో తడవద్దు. పైగా కొబ్బరినూనెను పట్టించుకోవటం మర్చిపోరాదు. షాంపూతో వాష్ చేశాక కుదుళ్లు గట్టిగా ఉండటంతో పాటు ఫ్రెష్‌గా అనిపిస్తుంది.
- అలవెరా, అరటి, నిమ్మ, ఉసిరికాయ, కుంకుడు, సీకాయలతో జుట్టుమరింత ఆరోగ్యంగా ఉంటుంది.
- కొందరు వానాకాలం కదా...అని తక్కువ నీళ్లు తాగుతారు. ఇది మంచిది కాదు. దప్పిక అయినప్పుడు కచ్చితంగా నీళ్లు తాగాల్సిందే. ముఖాన్ని శుభ్రంగా ఉంచుకోవాలి. తేమను తీసేయాలి. మందార పూలు, మందార ఆకుల రసం, నిమ్మ, అలవెరాలాంటి సహజమైన ఉత్పత్తులతో ఫేస్‌మాస్క్ వేసుకోవాలి.దీంతో మృత కణాలు తొలగిపోతాయి. మొటిమలు,దద్దుర్లు రావు.
- చర్మాన్ని చల్లబరిచేందుకు క్లెన్సింగ్, టోనింగ్, మాయిశ్చరైజింగ్ చేయాలి.
- వర్షాకాలం సింథటిక్,బిగుతైన దుస్తులను వాడకూడదు,

*(మిగతా 19వ పేజీలో)*

# తెలంగాణాలో రూ. 2 లక్షల వరకు పంట రుణాల మాఫీ

తెలంగాణాలో రెండు లక్షల రూపాయల వరకు రైతుల పంట రుణాలను మాఫీ చేయాలని ఆ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా, తొలి విడతగా ఒక లక్ష రూపాయలకు మించని రుణాలను జులై 18వ తేదీన మాఫీ చేశారు. రెండవ విడతగా ఆగస్టు నెలలోగా మొత్తం రూ. 2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది.

ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ రుణ మాఫీ మార్గదర్శకాలను విడుదల చేసింది. కుటుంబానికి రూ. 2 లక్షల వరకు రుణమాఫీ వర్తిస్తుందని స్పష్టం చేసింది. 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 13 వరకు తీసుకున్న పంట రుణాల బకాయిలకు మాత్రమే ఈ రుణమాఫీ వర్తిస్తుందని, రైతు కుటుంబం గుర్తింపునకు వ్యవసాయ పాస్ బుక్ ప్రామాణికమని తెలిపింది. పంట రుణమాఫీ కోసం ప్రత్యేక వెబ్ పోర్టల్ ఏర్పాటు చేయనున్నారు. రుణమాఫీ నగదు నేరుగా లబ్దిదారుల రుణ ఖాతాల్లోనే జమకానుంది. ఆరోహణ క్రమంలో రుణమాఫీ సొమ్ము విడుదల చేస్తారు.

ఎస్‌ఏ, జేఎల్, ఆర్ఎంజీ, ఎల్ సీఎస్ రుణాలకు, రీషెడ్యూల్ చేసిన రుణాలకు మాఫీ వర్తించదు. రుణమాఫీపై రైతుల సందేహాలు తీర్చేందుకు ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. రైతు సమస్యలు ఉంటే 30 రోజుల్లో పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. మరిన్ని వివరాలకు వెబ్ పోర్టల్ ద్వారా లేదా మండల సహాయ కేంద్రాలను సంప్రదించడం ద్వారా తెలుసుకోవచ్చునని ప్రభుత్వం పేర్కొంది.

**పాస్‌బుక్ ఆధారంగానే రైతు రుణమాఫీ: సీఎం రేవంత్‌రెడ్డి**

రైతు రుణమాఫీకి రేషన్ కార్డు ప్రాతిపదిక కాదని... పాస్ బుక్ మాత్రమే ప్రాతిపదిక అని తెలంగాణ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి అన్నారు. జులై 18 న రూ. 1 లక్ష వరకు రుణమాఫీ నేపథ్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... కొంతమంది రైతు రుణమాఫీకి రేషన్ కార్డు ప్రాతిపదిక అని అసత్య ప్రచారం చేస్తున్నారని, అది సరికాదని, రుణమాఫీకి పాస్ బుక్ మాత్రమే కొలబద్ద అని అన్నారు.

రుణమాఫీ కావాలంటే భూమి ఉండాలి... పాస్ బుక్ ఉండాలి... రుణం తెచ్చుకొని ఉండాలని వ్యాఖ్యానించారు. రుణమాఫీకి సంబంధించి ఏదైనా సాంకేతిక లోపం వస్తే బ్యాంకు అధికారుల వద్దకు వెళ్లాలని సూచించారు. వారు సహకరిస్తారన్నారు.

ఇది తొలి విడత మాఫీ మాత్రమేనని, ఆగస్ట్ లోగా రూ. 2 లక్షల వరకు రుణాలు ఉన్న అన్నీ మాఫీ చేస్తామని శ్రీ రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. .

■

## తెలంగాణా అంగన్వాడీలకు ఉద్యోగానంతర ప్రయోజనాలు

*తెలంగాణలోని అంగన్వాడీ కేంద్రాలలో పనిచేస్తున్న టీచర్లు, ఆయాలకు యికపై ఉద్యోగ విరమణానంతర ప్రయోజనాలు (రిటైర్మెంట్ బెనిఫిట్స్) అందిస్తామని మంత్రి సీతక్క తెలిపారు. త్వరలోనే దీనికి సంబంధించి జీఓ జారీ చేస్తామని ఆమె పేర్కొన్నారు. హైదరాబాద్ లోని రహమత్ నగర్‌లో జరిగిన 'అమ్మ మాట-అంగన్వాడీ బాట' కార్యక్రమంలో మంత్రి సీతక్క ఈ ప్రకటన చేశారు.*

*ఉద్యోగ విరమణ పొందే అంగన్వాడీ టీచర్ కు రూ. 2 లక్షలు, ఆయాకు రూ. లక్ష చొప్పున తెలంగాణ ప్రభుత్వం అందజేయనుంది. నామమాత్రపు వేతనంతో సేవలందిస్తున్న అంగన్వాడీ సిబ్బంది కష్టాలు ప్రభుత్వానికి తెలుసని మంత్రి అన్నారు. అంగన్వాడీ సిబ్బందికి ఇచ్చిన హామీని తమ ప్రభుత్వం నిలబెట్టుకుంటుందని, అతి త్వరలోనే ఈమేరకు జీఓ విడుదల చేస్తామని మంత్రి సీతక్క తెలిపారు*

■

నిజమైన ఆనందానికి చిరునామా నీ తోడ్పాటుతో సంతోషంగా జీవించేవారి కళ్లలో చిందే చిరునవ్వు

# లెప్రా సొసైటీ సి.బి.ఓ లకు ఏపిమాస్ శిక్షణ

– జి. శ్రీనివాస్




తెలంగాణ రాష్ట్రంలో లెప్రా సొసైటీ – హైదరాబాద్ ప్రోత్స హిస్తున్న సి.బి.ఓ లకు రెండు విడతలుగా 2024 జూన్ నెలలో 11 నుండి 13 వరకు , 18 నుండి 20 వరకు ఏపిమాస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో శిక్షణ నిర్వ హించటం జరిగింది.

ఈ శిక్షణలో మహిళా, పురుష సెక్స్ వర్కర్స్, ట్రాన్స్‌జెండర్లు, వారి కోసం పని చేస్తున్న సంస్థల సిబ్బంది కలిపి 47 మంది అభ్యాసకులు 20 సి.బి.ఓ ల నుండి పాల్గొన్నారు. ప్రతి బ్యాచ్‌కు మూడు రోజుల చొప్పున శిక్షణ ఇవ్వటం జరిగింది. శిక్షణ వివరాలు:

| బ్యాచ్ నెం. | శిక్షణ తేదీలు | పాల్గొన్న అభ్యాస కుల సంఖ్య | పాల్గొన్న సి.బి.ఓ సంఖ్య & జిల్లాల పేరు |
|---|---|---|---|
| 1 | 11 నుండి 13 జూన్ 2024 | 23 | 09 (వరంగల్, మంచిర్యాల్, జగిత్యాల్, కరీంనగర్, సంగారెడ్డి) |
| 2 | 18 నుండి 20 జూన్ 2024 | 24 | 11 (నిజామాబాద్, ఖమ్మం, కొత్తగూడెం) |
| | మొత్తం | 47 | |

మూడురోజుల పాటు జరిగిన శిక్షణలో సి.బి.ఓ ల ఆవశ్యకత, సంస్థల విజన్, మిషన్, లక్ష్యాలు, విలువలు, సంస్థల స్పష్టమైన ప్రణాళికలు, పరిపాలనాపరమైన నిర్మాణం, సంస్థల సభ్యుల విధులు–బాధ్యతలు, సమావేశాల నిర్వహణ, సంస్థలలో నాయకత్వం, వివిధ రకాలైన సిస్టమ్స్, మంచి పద్దతులు, చట్టపరమైన అంశాలు మొదలగు విషయాలపై శిక్షణ ఇవ్వటం జరిగింది.

పూర్తి భాగస్వామ్య పదతిలో సహభాగ శిక్షణ పద్దతులను ఉపయోగిస్తూ శిక్షణ నిర్వహించారు. ఈ శిక్షణలో లెప్రా సొసైటీ ముఖ్య కార్యనిర్వహణ అధికారి, తెలంగాణా రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఏపిడి, జెడి గార్లు, ప్రాజక్ట్ డైరెక్టర్స్ పాల్గొని అభ్యాసకులు నేర్చుకున్న అంశాలను వారి సంస్థలలో పాటించాలని కోరారు.

లెప్రా సొసైటీ నుంచి శ్రీమతి పద్మావతి, శ్రీ ప్రశాంత్, శ్రీ విష్ణు ఈ రెండు బ్యాచ్‌ల శిక్షణలో పాల్గొన్నారు.

ఏపిమాస్ నుంచి శ్రీ సి.యస్.రెడ్డి, శ్రీమతి యస్. రామలక్ష్మి, శ్రీమతి కళామణి, శ్రీ మురళి జాజున, శ్రీమతి లిఖిత, శ్రీమతి దివ్యశ్రీ , జి.శ్రీనివాస్ రెడ్డి , శిక్షణ కోఆర్డినేటర్ శ్రీ జి. శ్రీనివాస్ పాల్గొని శిక్షణ అంశాలు సభ్యులకు అర్ధమయ్యేలాగా వివిధ పద్దతులు ఉపయోగిస్తూ వివరించారు.

చివరలో శిక్షణలో పాల్గొన్న అభ్యాసకులు మాట్లాడుతూ ఇలాంటి శిక్షణలు ఎన్నో తీసుకున్నాము కాని ఇంత చక్కగా నేర్చుకోవటం ఇక్కడే జరిగింది అని చెప్పారు.

ఇంకా ఈ శిక్షణ అనంతరం కూడా వారి వారి సంస్థలలో జరుగు వార్షిక సమావేశాలు, ఇతర కార్యశాలలకు ఏపిమాస్ సంస్థ సాంకేతిక సహకారం అందించాలని కోరారు. ■

ఇతరుల కష్టసుఖాలలో నీవు తోడుగా నిలిస్తే నీ కష్టసుఖాలలో వారు నీకు తోడుగా నిలుస్తారు

# నిర్మల్‌లో జిల్లా స్థాయి 'వాష్' కార్యశాల

**– మైత్రి ప్రవీణ్, రాజోజుల బ్రహ్మచారి**

తెలంగాణ రాష్ట్రం నిర్మల్ పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో ఏపిమాస్ ఆధ్వర్యంలో వాటర్.ఆర్గ్ సంస్థ (వాటర్.ఓఆర్‌జి) మద్దతుతో 25.07.2024 నాడు నీరు పారిశుధ్యం, పరిశుభ్రత కార్యక్రమం (వాష్)పై జిల్లా స్థాయి కార్యశాలను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని జిల్లా ఆరోగ్య శాఖ అధికారి శ్రీ ధన్‌రాజ్, సెర్ప్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్లు శ్రీ రాజేశ్వర్, శ్రీ జ్ఞాను, శ్రీ సాయి



ప్రసాద్, శ్రీమతి విజయలక్ష్మి, శ్రీమతి శోభారాణి, మెప్మా పీడీ శ్రీ సుభాష్, ఏపిమాస్ కెపాసిటి బిల్డింగ్ డైరెక్టర్ శ్రీ మురళి, వాష్ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీ కరి శ్రీనివాస్, సిబిబిట ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీ రాజేశ్వర్, శ్రీ ఆదిత్య, శ్రీ అనిల్, శ్రీమతి ఛాయ, జిల్లా సమన్వయకర్త శ్రీ మైత్రి ప్రవీణ్, వాష్ ప్రాజెక్ట్ అసిస్టెంట్ మేనేజర్ శ్రీ బ్రహ్మచారి పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభమైంది.

మొదట నీరు, పారిశుధ్యం, పరిశుభ్రత (వాష్) కార్యక్రమం జిల్లా స్థాయి కార్యశాల ఉద్దేశము, ఎజెండా ఏపిమాస్ 23 సంవత్సరాల సుదీర్ఘ అనుభవాలు, లక్ష్యాలు, సంస్థ విలువలు, సంస్థ కల, చేస్తున్న కార్యక్రమాల గురించి శ్రీ జాజున మురళి వివరించారు.

తర్వాత నిర్మల్ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీ ఫైజాన్ అహ్మద్ ముఖ్య అతిథిగా పాల్గొని నీరు, పారిశుధ్యం, పరిశుభ్రత (వాష్) అనే అంశాలను ప్రతి కుటుంబం ఎలా పాటించాలో, త్రాగే నీటిని ఎలా శుభ్ర పరుచు కోవాలో, మరుగుదొడ్లను సరైన పద్ధతుల ద్వారా ఉపయోగించుకుని రోగాలు రాకుండా చూసుకోవాలని హితవు చెప్పారు.

వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అందరికి అవగాహన కల్పించాలని, ఈ విషయంలో ఏపిమాస్ చేస్తున్న కృషి ప్రశంసనీయమని, ఇతర స్వచ్ఛంద సంస్థలు కూడా ప్రజలకు యిలాంటి అవగాహన పెంపొం దించే కార్యక్రమాలు చేపట్టాలని పేర్కొన్నారు.

జిల్లా ఆరోగ్యశాఖ అధికారి శ్రీ ధన్‌రాజ్ ఆరోగ్యం బాగుండాలంటే పరిసరాల పరిశుభ్రత సక్రమంగా ఉండాలని వివరిస్తూ, వర్షాకాలంలో నీరు నిల్వ వుండడం వలన దోమలు పెరుగుతాయని, దోమకాటు వల్ల డెంగ్యు, మలేరియ , చికెన్ గున్యా లాంటి రోగాలకు గురి కావడం జరుగుతుందని, అందువల్ల యింటి పరిసరాలను పొడిగా ఉంచుకోవాలని మరుగుదొడ్డి, మురికి కాలువలు శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు.

మునిసిపల్ కమిషనర్ మాట్లాడుతూ నీరు,పారిశుధ్యం, పరిశుభ్రత (వాష్) పై ప్రతి ఒక్కరు దృష్టి పెట్టి పని చేయాలని, పట్టణాన్ని 'ఆరోగ్య నిర్మల్' గా తీర్చిదిద్దాలని వివరిస్తూ, వర్షాకాలంలో నీరు నిలిచిపోకుండా చూడాలని, తడి చెత్త, పొడిచెత్త వేరువేరుగా వేయాలని సూచించారు.

తరవాత మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీ సుభాష్ మాట్లాడుతూ నిర్మల్, భైంసా, ఖానాపూర్ మునిసిపాలిటీలలో వాష్ శిక్షణ ఇవ్వడంతో రిసోర్స్ పర్సన్ ద్వారా సంఘ, సమాఖ్య సభ్యులకు అవగాహన కల్పించడంతో, వారికి రుణాలు అందుతున్నాయని, రిసోర్స్ పర్సన్‌లకు నగదు ప్రోత్సాహం లభిస్తున్నదని చెప్పారు.



ఎవరైతే సామాజిక నీటి శుద్ధి ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తారో వారికి సబ్సిడీ రూపేణా రెండు లక్షల రూపాయల వరకు వాష్ ప్రాజెక్ట్ అందిస్తుందని చెప్పారు.

వాష్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీ రాజోజుల బ్రహ్మచారి నీటి సంక్షోభాన్ని గురించి వివరిస్తూ, ప్రపంచ జనాభాలో 5% మంది బహిరంగ మలవిసర్జన చేస్తున్నారని, నీరు, పారిశుధ్యం, పరిశుభ్రత సంబంధిత వ్యాధుల కారణంగా ప్రతి సంవత్సరం 10 లక్షల కంటే ఎక్కువ మంది మరణిస్తున్నారని, ప్రతి 2 నిమిషాలకు ఒక పిల్లవాడు నీటి సంబంధిత వ్యాధితో మరణిస్తున్నారని, 68 కోట్ల జనాభాకు గృహ నీటి కనెక్షన్ లేదని, 29% పాఠశాలల్లో కనీస నీరు, పారిశుధ్యం అందుబాటులో లేవని చెబుతూ, నీరు, పారిశుధ్యం, పరిశుభ్రత (వాష్) ప్రాజెక్ట్ లక్ష్యాలు, ప్రాజెక్ట్ కార్యాచరణ గురించి వివరించారు.

ముఖ్యంగా నిర్మల్ జిల్లాలో 13 మండలాలలో , మూడు మునిసిపాలిటీలలో సుమారుగా 467 మంది వి.ఓ.ఎ, ఆర్.పి లకు వాష్‌పై అవగాహన కల్పించడం జరిగిందని, ఇప్పటివరకు 13.9 కోట్ల మూలధనాన్ని వాష్ అవసరాలకోసం వాడుకునేటట్లు చేయడం జరిగిందనిపిపిటీ ద్వారా వివరించారు.

తర్వాత వాష్ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీ కరి శ్రీనివాస్ గారు వాష్ కార్యక్రమం నిర్మల్‌లో బాగా అమలు జరుగుతున్నదని, జిల్లా స్థాయి కార్యశాలకు హాజరైన అధికారుల సలహాలు, సూచనలు తీసుకొని ప్రాజెక్ట్ ను మరింత ముందుకు తీసుకు వెళ్ళడానికి కృషి చేస్తామని అన్నారు.

నీరు, పారిశుధ్యం పరిశుభ్రత(వాష్)ను అజెండా అంశంగా ప్రతి ఎస్‌హెచ్‌జి, విఓ, ఎస్ఎల్ఎఫ్, టిఎల్ఎఫ్, ఎంఎస్, జిల్లా సమాఖ్యల సమావేశాలలో తప్పక చర్చించాలని సూచించారు. చేపట్టబోయే సామాజిక నీటిశుద్ధి ప్లాంట్, కమ్యూనిటీ టాయిలెట్స్ , నెల రోజుల ఆన్‌లైన్ వాష్ కోర్స్ శిక్షణ కార్యక్రమాల గురించి వివరించారు.

చివరగా జిల్లా సమన్వయకర్త శ్రీ మైత్రి ప్రవీణ్ నీరు, పారిశుధ్యము మరియు పరిశుభ్రత (వాష్) జిల్లా స్థాయి కార్యశాల నిర్వహణకు అనుమతిచ్చి, హాజరైన నిర్మల్ జిల్లా అదనపు కలెక్టర్‌కు, సెర్ప్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కు, జిల్లా ఆరోగ్యశాఖ అధికారికి, మునిసిపల్ కమిషనర్‌కు, ఆర్ డబ్ల్యు ఎస్ అసిస్టెంట్ ఇంజనీర్‌కు, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ కు, సెర్ప్, మెప్మా సిబ్బందికి, ఈ కార్యశాల నిర్వహణకు సంబంధించిన వారందరికి ధన్యవాదాలు తెలపడంతో కార్యశాల ముగిసింది. ■



సమస్యలనుంచి పారిపోతుంటే ఏనాడూ గెలవలేవు , ఎదురు నిలిచి ఎదుర్కోవడమే విజయ రహస్యం !

# సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో మెరుగ్గా తెలుగు రాష్ట్రాలు!

– జి. శ్రీనివాసరెడ్డి

ఐక్యరాజ్య సమితి ప్రపంచ నలుమూలల విస్తరించిన ప్రగతి నిరోధకాలను అధిగమించడానికి 17 సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు (ఎస్ డి జి) సూచించింది. ఈ లక్ష్యాల సాధనకు 2030వ సంవత్సరం గడువుగా ప్రపంచం నిర్దేశించుకున్న విషయం పాఠకులకు అవగతమే. నీతి ఆయోగ్ సంస్థ ప్రతి సంవత్సరం ఈ లక్ష్యాల సాధనలో జాతీయ స్థాయిలో, వివిధ రాష్ట్రాల స్థాయిలో సాధించిన పురోగతిని తెలియపరిచే నివేదికను ప్రచురిస్తుంది. 2023-24 సంవత్సరానికి సంబంధించిన వార్షిక నివేదికను ఆ సంస్థ ఇటీవల విడుదల చేసింది.

ప్రపంచ వ్యాప్తంగా ఈ లక్ష్యాల సాధన ఆశాజనకంగా లేనప్పటికీ, భారత దేశం ఈ లక్ష్యాల సాధనలో ముందడుగు వేస్తున్నదని ఈ నివేదిక తెలియజేసింది. ప్రపంచ ఎస్ డి జి పురోగతి నివేదిక 2024 ప్రకారం సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో కేవలం 17 శాతం మాత్రమే పురోగతి సాధిస్తుండగా, 50 శాతం లక్ష్యాల పురోగతి నిరాశాజనకంగా ఉంది. మరింత ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే 30 శాతం లక్ష్యాలు తిరోగమనంలో (నానాటికి దిగజారుతూ) పయనిస్తున్నాయి!

అయితే యిందుకు భిన్నంగా, "సబ్ కా సాత్ సబ్ కా వికాస్" , "వికసిత్ భారత్" నినాదాలతో భారత ప్రభుత్వం సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను త్వరితగతిన సాధించేందుకు కృషి చేస్తున్నదని నీతి ఆయోగ్ ఉద్ఘాటించింది.

**తెలుగు రాష్ట్రాల పురోగతి**

సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో తెలుగు రాష్ట్రాల పురోగతిని ఈ నివేదిక పొందుపరిచింది.

లక్ష్యాల సాధనలో పురోగతి కొలమానంగా రాష్ట్రాలను, కేంద్ర పాలిత ప్రాంతాలను 4 వర్గాలుగా విభజించారు.

1. సాధకులు (100-) 2. మార్గదర్శి ( 65-99- ఫ్రంట్ రన్నర్) 3. ప్రదర్శకులు (50-64-పెర్ఫార్మర్స్) 4. ఆశావాహులు (0-49 యాస్పిరెంట్స్). ఈ కొలమానాల ప్రకారం రెండు తెలుగు రాష్ట్రాల పురోగతి మార్గదర్శకంగా వుందని నీతి ఆయోగ్ నివేదిక స్పష్టంచేసింది.

**ఆంధ్రప్రదేశ్ :**

100కు గాను 74 మార్కుల సాధనతో ఆంధ్రప్రదేశ్ 9వ స్థానంలో నిలిచింది. ఎస్ డి జిలోని 7వ లక్ష్యమైన "అందుబాటులో నాణ్యమైన విద్యుత్" (అఫర్డబుల్, క్లీన్ ఎనర్జీ)ను ఆంధ్రప్రదేశ్ 100 శాతం సాధించిందని నివేదిక పేర్కొన్నది. "జల జీవన పరిరక్షణ" -95 మార్కులు (లైఫ్ అండర్ వాటర్ -ఎస్‌డిజి14), "భాధ్యతాయుతమైన ఉత్పత్తి, వినియోగం" – 93 మార్కులు (రెస్పాన్సిబుల్ ప్రొడక్షన్ అండ్ కన్జంప్షన్ – ఎస్‌డిజి 12), "స్వచ్ఛమైన నీరు , పరిశుభ్రత" – 91 మార్కులు (క్లీన్ వాటర్ అండ్ శానిటేషన్ -ఎస్‌డిజి-6) లక్ష్యాల సాధనలో రాష్ట్ర పురోగతి సంతృప్తి కరంగా ఉండగా, "పారిశ్రామికీకరణ, ఆవిష్కరణలు, మౌలిక వసతులు" కు – 49 మార్కులు (ఇండస్ట్రీ, ఇన్నోవేషన్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్-ఎస్‌డిజి-9), "లైంగిక సమానత్వం"- 51 మార్కులు (జెండర్ ఈక్వాలిటీ-5), "నాణ్యమైన విద్య" -52 మార్కులు (క్వాలిటీ ఎడ్యుకేషన్ – ఎస్‌డిజి- 4) లక్ష్యాల సాధనలో మాత్రం వెనుకపడిందని నివేదిక తెలియజేసింది.

**సరిసమానంగా తెలంగాణా**

ఆంధ్రప్రదేశ్‌తో సరి సమానంగా 100కు 74 మార్కులు సాధించి తెలంగాణ కూడా 9వ స్థానంలోనే నిలవడం విశేషం! 7వ లక్ష్యమైన "అందుబాటులో నాణ్యమైన విద్యుత్" (అఫర్డబుల్, క్లీన్ ఎనర్జీ– ఎస్‌డిజి– 7)ను తెలంగాణ రాష్ట్రం సైతం 100 శాతం సాధించిందని నివేదిక పేర్కొంది.

"పేదరిక నిర్మూలన" (నో పావర్టీ – ఎస్‌డిజి-2) లక్ష్య సాధనలో 91 మార్కులతో దేశంలో 2వస్థానంలో తెలంగాణ నిలిచింది. "స్వచ్ఛమైన నీరు , పరిశుభ్రత" – 90 మార్కులు (క్లీన్ వాటర్, శానిటేషన్ – ఎస్‌డిజి– 6), "సుస్థిర నగరాలు,

నీ కంటె ఎంత గొప్పవారితో వున్నావని కాదు, వారు నీకు అండగా నిలిచే వారో కాదో ఆలోచించుకో

సమాజాలు''-86 మార్కులు (సస్టైనయిబుల్ సిటీస్, కమ్యూనిటీస్-ఎస్‌డిజి- 11), ''హుందాతో కూడిన ఉపాధి కల్పన , ఆర్థిక అభివృద్ధి'' – 84 మార్కులు (డీసెంట్ వర్క్, ఎకనామిక్ (గ్రోత్- ఎస్‌డిజి- 8) లక్ష్యాల సాధనలో తెలంగాణా ముందంజలో వుండగా, ''లైంగిక సమానత్వం'' -49 మార్కులు (జెండర్ ఈక్వాలిటీ – ఎస్‌డిజి- 5), ''అందరికీ ఆహారం'' – 58 మార్కులు (జీరో హంగర్ – ఎస్‌డిజి-2), ''వాతవరణ పరిరక్షణ'' – 59 మార్కులు (క్లైమేట్ యాక్షన్ – ఎస్‌డిజి-13) లక్ష్యాల సాధనలో పురోగతి నిరాశాజనకంగా ఉందని నీతి ఆయోగ్ పేర్కొన్నది.

పూర్తి నివేదిక కోసం (ఆంగ్ల భాషలో) https://sdgindiaindex.niti.gov.in/#/download అనే లింకును, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల గురించి మరింత తెలుసుకోవడానికి https://sdgs.un.org/goals అనే లింకును ఉపయోగించుకోవచ్చు. ■

*(13వ పేజీ తరువాయి)*

## వానాకాలం ఆహారం

దద్దుర్లు వచ్చే అవకాశం ఉంది.

- విటమిన్ఎ, సి ఉండే టమాటాను ఆహారంలో ఉండేట్లు చూసుకోవాలి. దీనివల్ల చర్మకణాలు డ్యామేజ్ కావు. నల్లని మచ్చలు తొలగిపోతాయి. కొల్లాజిన్ ఉత్పత్తి పెరుగుతుంది. ఆపిల్, అరటి, దానిమ్మ తినాలి. తాజా పండ్లనే తినాలి. వేడివేడి ఆహారపదార్థాలనే తినాలి. ఫాస్ట్‌ఫుడ్ తినకూడదు. అల్లం టీ ప్రతిరోజూ తాగాలి. దీనివల్ల మూడ్ మారుతుంది. ముఖ్యంగా మాస్క్ విషయానికొస్తే పసుపుతో మాస్క్ వేసుకోవటం వల్ల ఎలాంటి చర్మసమస్యలు తలెత్తవు.
- మేకప్ వేసుకోకపోవటం మంచిది. ప్రతిరోజూ రెండు, మూడుసార్లు చర్మాన్ని శుభ్రపరచుకోవాలి.
- వీలైనంతవరకూ గోరువెచ్చని నీటిని తాగాలి. ముఖ్యంగా వార్షాకాలంలో చర్మం, జుట్టు తడవకుండా జాగ్రత్తలు తీసుకోవటం తప్పనిసరి.

– ఆంధ్రజ్యోతి సౌజన్యంతో ■

## పశువుల షెడ్ల నిర్మాణానికి భారీ రాయితీ

*ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా పశు పోషకులను ప్రోత్సహించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. వ్యవసాయ అనుబంధ కార్య కలాపాలను ప్రోత్సహించడం, గ్రామీణ పేదల జీవనోపాధిని మెరుగుపరిచేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు ఆయన చెప్పుకొచ్చారు.*

*మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా 90శాతం రాయితీపై పశువుల షెడ్లు నిర్మించనున్నట్లు ఆయన తెలిపారు. పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్ల షెల్టర్ల నిర్మాణానికి రాయితీ పథకాన్ని రాష్ట్రవ్యాప్తంగా అర్హులందరికీ అమలు చేయనున్నట్లు మంత్రి అచ్చెన్న వెల్లడించారు.*

**పశు పోషకులకు అందించే లబ్ధి ఇదే..**

*రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పశు పోషకులకు 90శాతం రాయితీపై ఒక్కో షెడ్డుకు గరిష్ఠంగా రూ. 2. 30లక్షలు, గొర్రెలు, మేకల షెడ్లకు 70శాతం రాయితీపై గరిష్ఠంగా యూనిట్‌కు రూ. 2. 30లక్షలు ఇవ్వనున్నట్లు మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు.*

*అలాగే కోళ్ల పెంపకందారుల కోసం ఒక్కో షెడ్డు నిర్మాణానికి 70శాతం రాయితీపై గరిష్ఠంగా యూనిట్‌కు రూ. 1. 32లక్షలు ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. త్వరలో అన్నీ జిల్లాల్లో ఈ పథకం అమలు కానున్నట్లు మంత్రి అచ్చెన్న స్పష్టం చేశారు.*

*మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, ఆంధ్రప్రదేశ్ పశుసంవర్ధక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో పశువుల పెంపకం దారులను మరింత ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి అచ్చెన్నాయుడు చెప్పారు.* ■

# ప్రకృతి వ్యవసాయంతోనే పర్యావరణ పరిరక్షణ

– ఎస్. ప్రహల్లాద

**"జీన్** జాక్స్ రూసో" అనే ఫ్రెంచ్ రాజకీయ తత్వవేత్త (1712–1778) " ప్రకృతికి తిరిగి వెళ్ళండి (గో బాక్ నేచర్) అనే ఒక మాట అన్నారు. ఆయన అభిప్రాయం ప్రకారం మానవులు సహజ సిద్దంగా పవిత్రంగా ఉంటారని నాగరికత మరియు సమాజంలో వచ్చే మార్పులు మానవులను భ్రష్టు పట్టిస్తాయని అన్నారు.

అందువలన ప్రజలు సమాజములో వచ్చే కృత్రిమ మార్పులను తిరస్కరించి సులభమైన మరియు సహజమైన జీవన విధానానికి తిరిగి వెళ్ళాలి. అప్పుడే మానవాళి మనుగడ సాధ్యమవుతుంది.

ఈమధ్య కాలములో వ్యవసాయ పద్దతులలలోనూ, ప్రజల ఆహారపు అలవాట్లలోనూ, ప్రభుత్వ వ్యవసాయ విధానాలలోనూ, స్వచ్ఛంద సంస్థల చేపట్టే కార్యక్రమాలలోను వచ్చే మార్పులు మరియు దాత సంస్థల ఆసక్తి చూస్తుంటే ఎప్పుడో "రూసో" చెప్పిన మాటలు నేడు నిజమవుతున్నవని నిక్కచ్చిగా చెప్పవచ్చును.

ఈ వ్యాసములో వ్యవసాయ రంగంలో గతంలో వున్న పద్ధతులు, పరిణామ క్రమం మొదలగు వాటిని తెలుసు కుందాం.

**గతంలో ఆచరించిన వ్యవసాయ పద్దతులు:**

- సహజంగా భూమి సారవంతంగా, నిజాయితీగా వుండి మనుషులు ఏమి చెపితే ఆ మాట వినే గుణం వుంటుంది. అందువలననే రైతులు ఏమి పంట పండించాలని నిర్ణయించి ఏ రకం గింజలు నాటినా లేదా నారు నాటినా అ పంటలే పండుతాయి.
- సాగులో వున్న భూమితో పాటు కొండలు, గుట్టలు, అడవులు, పచ్చిక బయళ్ళు మొదలగు వాటికి కుడా సముచితమైన నిష్పత్తిలో భూములు ఉండేవి. అందువలన పర్యావరణము అనుకూలముగా వుండేది. మరోవైపు చెరువులు, గుంటలు, దిగుడు బావులు, వాగులు, వంకలు మొదలగు నీటి వనరులు వ్యవసాయమునకు మరియు త్రాగునీటికి సరిపోయే విధంగా ఉండేవి.
- స్థానికంగా అందుబాటులోని వివిధ రకాల వంగడాలను రైతులు వినియోగించేవారు. భూమి గట్లపై వున్న చెట్ల కొమ్మలను నరికి ఆ ఆకును భూమిలో వేసి కుళ్ళబెట్టి వ్యవసాయం చేయడం వలన భూమికి కూడా కొంత సత్తువ వచ్చి పంట దిగుబడి వచ్చేది.
- భూమిలో సారము పెంచడానికి వేరు శనగపిండి, కానుగ పిండిని నీటిలో నానబెట్టి చెట్ల, నీటితో కలిపి పంట మొదళ్లలో వదిలేవారు. ఫలితంగా భూసారము పెరిగి పంట దిగుబడి వచ్చేది.
- పంటలకు సోకే క్రిమి కీటకాల నుండి పంటలను రక్షించుటకు వేపనూనె, వివిధ రకాల కషాయాలు మొదలగు వాటిని పంటలపైన చల్లేవారు. ఫలితంగా క్రిమి కీటకాలు చనిపోవడంతో పాటు ఆరోగ్యకరమైన పంటలు పండించేవారు.
- పంట కాలము ఎక్కువగా వుండే పంటలు వేసి, ఆ పంట దిగుబడి వచ్చేవరకు వేచి చూసి పంట నూర్పిడి చేసేవారు. అటువంటి పంటలను తినుట వలన మనిషికి కావలసిన పోషక పదార్థాలు పుష్కలంగా ఉండేవి.

**పర్యవసానాలు:**

- భూమికి స్థిరమైన గుణం వుంటుంది. అనగా అసరమును బట్టి తన పరిమాణం పెంచడం లేదా తగ్గించడం చేయదు. మరోవైపు జనాభా పెరుగుచున్న కొలది మానవులు కొండలు, గుట్టలు, అడవులు, పచ్చిక బయళ్ళుగా వున్న భూమిని సాగులోని తీసుకొని

నీవు ఎవరి మనసైనా నొప్పిస్తే వారి మన్నన కోరు, నిన్నెవరైనా నొప్పిస్తే వారిని మన్నించు

రావడానికి వాటిలోని చెట్లను మరియు నీటి వనరులను తగ్గించి వేయడం జరిగినది. ఫలితముగా జీవావరణంలో వైవిధ్యం ఏర్పడి మానవాళి మనుగడ ప్రశ్నార్ధకంగా మారినది.

- ♦ పర్యావరణములో వచ్చే అసమానతల వలన రుతువులు క్రమం తప్పి నిర్ణీత సమయాలలో వర్షాలు పడడం లేదు.
- ♦ అధికంగా వర్షాలు పడినపుడు నీటిని నిలవ చేసుకోవడానికి సరిపడే ప్రాజెక్టులు లేని కారణంగా, వర్షపు నీరు వృధాగా సముద్ర పాలు అవుచున్నది.
- ♦ సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెంది తక్కువ కాలములో అధిక దిగుబడినిచ్చే నూతన వంగడాల అభివృద్ధి పరిచినారు. వాటి ద్వారా అధిక ఉత్పత్తి సాధించాలంటే భూమిలో సహజ సిద్ధంగా వున్న సారము సరిపోదు. అందువలన రసాయనిక ఎరువులు అభివృద్ధి పరచడం జరిగింది.
- ♦ ఈ రసాయనిక ఎరువులను విపరీతంగా వాడుట వలన భూమిలోని సహజ సిద్ధ సారము తగ్గి పోవడంతో పాటు పండే పంటలు కూడా కలుషితం అవుచున్నవి. భూమి కూడా ఎరువులు వేస్తేనే పంట పండే పరిస్థితికి వచ్చింది.
- ♦ మరోవైపు నూతన వంగడాల పంట పెరిగే కొలది వివిధ రకాల క్రిమి కీటకాలు సోకి పంట నష్టం వాటిల్లడం జరుగుచున్నది. ఫలితంగా రసాయనిక క్రిమి సంహారక మందులు అభివృద్ధి చెంది వాటి వినియోగం కూడా ఎక్కువ అయినవి.
- ♦ ఈ క్రిమి సంహారక మందులలో చాలావరకు ప్రమాదకరమైనవని తెలిసినప్పటికీ రైతులు తమ పంటలను కాపాడు కొనుటకు వాటిని విరివిగా వాడుచున్నారు.
- ♦ కొన్ని ప్రత్యేక పరిస్థితులలో ఈ క్రిమి సంహారక మందులు మనుషుల ప్రాణాలు తీసుకొనుటకు వినియోగించడం కూడా జరుగుచున్న దాన్ని మనం దినపత్రికల లోను, టి.వి మాధ్యమాలలోను చూస్తూ వున్నాము.
- ♦ మనము పండించే పంటలలో పురుగు మందుల అవశేషాలు అధికంగా ఉండుట వలన వాటిని తిని చాలామంది ప్రజలు అనారోగ్యాలకు గురు అవుచున్నారని వైద్యులు కుడా తెలియజేస్తున్నారు.

**నూతన పోకడలు :**

ప్రస్తుతము రైతులు పండించే పంటల వలన కలిగే దుష్ప్రభాల నుండి ప్రజలను కాపాడుటకు తిరిగి గతంలో మాదిరి సంప్రదాయ వ్యవసాయము / ప్రకృతి వ్యవసాయ విధానాలను తిరిగి ప్రారంభించుటకు వైపు ప్రభుత్వం మరోవైపు స్వచ్ఛంద సేవా సంస్థలు ప్రకృతి వ్యవసాయం పేరుతో తిరిగి పాత వ్యవసాయ విధానాలకు అనేక చర్యలకు శ్రీకారం చుట్టినారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయంను ప్రోత్సహించుటకు రైతు సాధికారత సంస్థను ఏర్పాటు చేసి తద్వారా గ్రామాలలో అనేక ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలను చేపట్టుచున్నది.

జి.ఐ.జెడ్ జెర్మని వారి సహాయముతో ఏపిమాస్ సంస్థ హరిత వినూత్న కేంద్రాల పథకములో భాగముగా ఎంపిక చేసిన మండలాలలో రసాయనిక ఎరువులు మరియు క్రిమి సంహారక మందుల తగ్గింపు, ప్రకృతి వ్యవసాయ విధానాలపై పని చేస్తూ సత్ఫలితాలు చూస్తున్నారు.

అజీం ప్రేమ్‌జీ ఫౌండేషన్ లాంటి కొన్ని దాత సంస్థలు వివిధ స్వచ్ఛంద సంస్థల ద్వారా ప్రకృతి వ్యవసాయ విధానాలను ప్రోత్సహిస్తున్నది.

రసాయనిక ఎరువులు మరియు క్రిమి సంహారక మందులు విరివిగా వాడుట వలన వచ్చే ఉత్పత్తి కంటే ప్రకృతి వ్యవసాయం ద్వారా వచ్చే దిగుబడి తక్కువగా వుంటుంది.

అందువలన రైతులు ఎక్కువమంది మక్కువ చూపడం లేదు. అందువలన ప్రభుత్వం రైతు బజారులలో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా పండించిన పంటలకు

ప్రత్యేకంగా మార్కెటింగ్ కేంద్రాలను ప్రోత్సహిస్తున్నది. ఈ ప్రకృతి వ్యవసాయం విధానాలలో సంవత్సరం పొడవునా రైతులకు ఆదాయం వచ్చే విధంగా ఎ.టి.ఎం నమూనా, ఐదు అంతస్తుల నమూనా, సూర్యమండలం, మొదలగు వాటిని ప్రోత్సహించుచున్నారు.

**వర్షాధార పంటలకు ప్రోత్సాహం :**

నీటి ఎద్దటి వున్న ప్రస్తుత తరుణంలో వర్షాధార పంటలకు ముఖ్యంగా వివిధ రకాల చిరుధాన్యాల పంటలకు అధిక ప్రాధాన్యత కల్పించ బడుతున్నది. ఈ వర్షాధార పంటలకు ఎక్కువగా క్రిమి కీటకాలు ఆశించవు. అందువలన రసాయనిక ఎరువులు మరియు క్రిమిసంహారక మందుల వినియోగము బాగా తగ్గిందని చెప్పవచ్చును.

ఒకవైపు ప్రజలు ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే పంటలకు ప్రాముఖ్యత ఇవ్వడం వలన రైతులు కూడా అలాంటి పంటలనే వేస్తున్నారు. ఫలితంగా రసాయనిక ఎరువులు & క్రిమి సంహారక మందుల వినియోగము బాగా తగ్గిందని చెప్పవచ్చును. అందువలన రసాయనిక ఎరువులు తయారుచేసే కంపెనీ జీవన ఎరువుల పేరుతో రసాయనాలు లేని ఎరువులను తయారు చేయడం జరుగుచున్నది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా జీవన వనరుల కేంద్రాలను (బయో రిసోర్స్ సెంటర్స్) ఏర్పాటు చేసి తద్వారా జీవన ఎరువులను తయారు చేయడం, క్రిమి సంహారక మందుల స్థానంలో వేప నూనె, వివిధ రకాల కషాయాలు మొదలగు వాటిని ప్రోత్సహిస్తుంది.

ఇందువలన రైతులు కూడా రసాయనిక ఎరువులు మరియు క్రిమి సంహారక మందులు లేని వ్యవసాయ ఉత్పత్తులను విరివిగా పండించుచున్నారు.

ఇదే ఒరవడి కొనసాగి రైతులు రసాయనిక ఎరువులు మరియు క్రిమి సంహారక మందుల అవశేషాలు లేని ఉత్పత్తులను పండించి ప్రజలకు అమ్మి, వారి ఆరోగ్యాలను పరిరక్షించడంతో పాటు పర్యావరణ సమతౌల్యం కొరకు తమ వంతుతో పాటు అందిస్తారని ఆశిద్దాం. ■

## ప్రకృతి వ్యవసాయంపై కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్‌కు శిక్షణ

– అమరేంద్ర

*రాయలసీమ వాటర్ ప్రాజెక్టులో భాగంగా 2024 జులై 8-12 తేదీలలో ప్రకృతి వ్యవసాయంపై శిక్షణా కార్యక్రమం నూజివీడులోని 'కృష్ణ సుధ అకాడమి ఫర్ నేచురల్ ఫార్మింగ్' లో జరిగింది. ఈ శిక్షణా కార్యక్రమానికి ఏపిమాస్ నుండి పాల్గొన్న 5 మందితో పాటు, ఇతర భాగస్వామ్య సంస్థల నుండి వచ్చిన మొత్తం 27 మందికి హైదరాబాదుకు చెందిన 'సెంటర్ ఫర్ సస్టైనబుల్ అగ్రికల్చర్(సిఎస్ఎ)' సాంస్థ వారు శిక్షణ యిచ్చారు.*

***బోధన పద్ధతి :*** *తరగతిలో బోధనతోపాటు, పొలంలో అనుభవ పూర్వక అభ్యసన*

***బోధించిన ముఖ్య అంశాలు***

1. *వాతావరణం మార్పు వల్ల వ్యవసాయంలో సంభవించిన పరిణామాలు, సుస్థిర వ్యవసాయ పద్ధతుల ఆచరణ*
2. *సుస్థిర నేల యాజమాన్యం*
3. *పొడినేలలో వానలకు ముందు విత్తనం వేయు వ్యవసాయ పద్ధతి (పిఎండిఎస్)*
4. *365 రోజులు పండించు కల్పతరు కూరగాయల పద్ధతి*
5. *ఐదు అంచెల వ్యవసాయం*
6. *ఆరుతడి వరి వ్యవసాయం*
7. *పంటలకు పోషక యాజమాన్యం*
8. *ఎక్కువ మోతాదులో మామిడి మొక్కల పెంపకం*
9. *పొలంబడిా, వ్యవసాయ ఆవరణ వ్యవస్థ పరిశీలన*
10. *పురుగులు, తెగుళ్ళు గుర్తింపు,ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో యాజమాన్యం,ద్రావకాలు, కషాయాల తయారీ*

*ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుభవపూర్వకంగా నేర్చుకొన్నామని, రైతులతో కలసి పని చేయుటకు ఈ శిక్షణ చాలా ఉపయోగకరంగా వున్నదని అభ్యాసకులు పేర్కొన్నారు.* ■

**ధనముంటే ధనవంతుడు అంటారు, ఆ ధనంతో ఇతరుల కష్టాలు తీరిస్తే భగవంతుడు అంటారు**

# భూముల వివాదాలను నివారించే 'భూ ఆధార్' !

**ఆ**ధార్ కార్డ్ అంటే మనుషులకు ఉంటుందని తెలుసు. ఇకపై భూములకు కూడా రానున్నాయి. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో భూములకు కూడా ఆధార్ రానుంది. దీని ద్వారా చాలా ప్రయోజనాలు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం సాధారణ బడ్జెట్–2024లో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో భూసంస్కరణలకు కీలక చర్యలు చేపట్టింది. గ్రామీణ ప్రాంతాల్లోని భూములకు యూనిక్ ఐడెంటిఫికేషన్ నంబర్లు లేదా భూ ఆధార్, పట్టణ భూరికార్డుల డిజిటలైజేషన్ చేయాలని ప్రతిపాదించింది. వచ్చే మూడేళ్లలో ఈ భూ సంస్కరణలను పూర్తి చేయడానికి రాష్ట్రాలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుంది. ల్యాండ్ బేస్ నుంచి భూ యాజమాన్యం క్లియర్ అవుతుంది. భూమికి సంబంధించిన వివాదాలు కూడా ముగుస్తాయి.

ఈ పథకం కింద, గ్రామీణ ప్రాంతాల్లోని అన్ని భూములకు 14 అంకెల ప్రత్యేక గుర్తింపు సంఖ్య లభిస్తుంది. దీనిని భూ ఆధార్ (యుఎల్పీఐఎన్)గా గుర్తిస్తారు. ఇందులో భూమి గుర్తింపు సంఖ్యతో పాటు యాజమాన్యం, రైతుల సర్వే, మ్యాపింగ్, రిజిస్ట్రేషన్ చేస్తారు. ఇది వ్యవసాయ రుణాలను సులభంగా పొందడానికి, ఇతర వ్యవసాయ సేవలను సులభతరం చేస్తుంది. భారతదేశ భూ రికార్డులను డిజిటలైజ్ చేయడానికి, ఇంటిగ్రేటెడ్ ల్యాండ్ రికార్డ్స్ మేనేజ్మెంట్ వ్యవస్థను అందించడానికి ప్రభుత్వం 2008లో ప్రతిష్టాత్మక ప్రాజెక్టును ప్రారంభించింది.

పట్టణ ప్రాంతాల్లోని భూరికార్డులను జీఐఎస్ మ్యాపింగ్‌తో డిజిటలైజ్ చేయనున్నారు. ప్రాపర్టీ రికార్డ్స్ అడ్మినిస్ట్రేషన్, అప్డేషన్, ట్యాక్స్ అడ్మినిస్ట్రేషన్ కోసం ఐటీ ఆధారిత వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. ఇది పట్టణ స్థానిక సంస్థల ఆర్థిక స్థితిని మెరుగుపరచడానికి కూడా సహాయపడుతుంది.

**భూ ఆధార్ ఎలా పనిచేస్తుంది?**

1. ప్లాట్ ఖచ్చితమైన భౌగోళిక స్థానాన్ని గుర్తించడానికి మొదట జీపీఎస్ టెక్నాలజీని ఉపయోగించి జియో ట్యాగింగ్ చేస్తారు.
2. అప్పుడు సర్వేయర్లు ప్లాటు సరిహద్దులను భౌతికంగా ధృవీకరించి కొలుస్తారు.
3. ప్లాట్ కోసం భూమి యజమాని పేరు, వినియోగవర్గం, విస్తీర్ణం వంటి వివరాలను సేకరిస్తారు.
4. సేకరించిన వివరాలన్నీ ల్యాండ్ రికార్డ్స్ మేనేజ్మెంట్ సిస్టమ్‌లో నమోదు అవుతాయి.
5. ఈ సిస్టమ్ ఆటోమేటిక్‌గా ప్లాట్ కోసం 14 అంకెల బియు–ఆధార్ నంబర్‌ను జనరేట్ చేస్తుంది, ఇది డిజిటల్ రికార్డుతో లింక్ చేస్తారు.

ఆధార్ కార్డు తరహాలో ఏర్పాటు చేసిన ల్యాండ్ బేస్‌లో స్టేట్ కోడ్, డిస్ట్రిక్ట్ కోడ్, సబ్ డిస్ట్రిక్ట్ కోడ్, విలేజ్ కోడ్, ప్లాట్ యూనిక్ ఐడీ నెంబర్ మొదలైనవి ఉంటాయి.

డిజిటల్, ఫిజికల్ ల్యాండ్ రికార్డ్ డాక్యుమెంట్‌లో బీయూ–ఆధార్ నంబర్‌ను డిజిటలైజ్ చేస్తారు. భూమిని బదలాయించినా, పలు భాగాలుగా విభజించినా, అందులో ఏవైనా మార్పులు జరిగినా ప్లాట్ భౌగోళిక సరిహద్దుకు భూమి–ఆధార్ నంబర్ ఒకేలా ఉంటుంది.

**భూ–ఆధార్ ప్రయోజనాలు**

- భూమి స్థాయి మ్యాపింగ్, కొలత ద్వారా ఖచ్చితమైన భూ రికార్డులను నిర్ధారిస్తుంది.
- ప్లాట్ గుర్తింపులో అస్పష్టతను తొలగిస్తుంది, తరచుగా వచ్చే భూ వివాదాలకు ఇక చెక్ పడనుంది.
- ఆధార్‌తో అనుసంధానించడం ద్వారా ఆన్ లైన్‌లో భూ రికార్డుల నిర్వహణ సులభమవుతుంది.
- ప్లాట్‌కు సంబంధించిన మొత్తం చరిత్ర, యాజమాన్య వివరాలను తెలుసుకోవచ్చు. విధాన రూపకల్పన కోసం ప్రభుత్వం ఖచ్చితమైన భూమి డేటాను పొందుతుంది.

■

# కౌలు రైతుల కష్టాల కడగండ్లు తీరినట్టేనా ?

కౌలు రైతులకు రుణ కష్టాలు తీరనున్నాయా... అంటే అవునని ఆంధ్రప్రదేశ్ నూతన ప్రభుత్వం చెప్తోంది. రాష్ట్రంలో పంటలను సాగుచేసే వారిలో కౌలు రైతులే అధికం. అయితే సాగు వ్యయం కోసం కౌలు రైతులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తున్నది. ప్రభుత్వం నుంచి రాయితీలు, సబ్సిడీలు, యితర ప్రయోజనాలు భూ యజమానులు పొందుతుండగా వాస్తవ సాగుదారులైన కౌలు రైతులకు కష్టాలు, నష్టాలు, అప్పులు మిగులుతున్నాయి. చివరకు పంటల సాగుకు ప్రభుత్వం బ్యాంకుల ద్వారా ఇచ్చే రుణాలను కూడా కౌలు రైతులు పొందలేకపోతున్నారు.

కౌలు రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన కౌలు రాయితీకార్డులు (సీసీఆర్) కూడా అందకపోవడంతో బ్యాంకుల నుంచి రుణాలు కూడా వారు సక్రమంగా పొందలేకపోతున్నారు. ప్రతికూల పరిస్థితుల్లో అప్పులపాలై పలువురు కౌలు రైతులు ఆత్మహత్యలు కూడా చేసుకున్నారు. ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో వేల కోట్ల వ్యవసాయ రుణాల పద్దును బ్యాంకర్ల సమక్షంలో ప్రభుత్వం ఘనంగా ప్రకటించడం, తర్వాత అన్నదాతలకు పాత రుణాల చెల్లింపులకు కొత్త రుణాలను సర్దుబాటు చేసి కొత్త రుణాలు ఇచ్చినట్లు గొప్పగా ప్రకటించుకోవడం పరిపాటిగా మారింది.

రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరాక ప్రకటించిన వార్షిక రుణ పద్దులో వ్యవసాయ రంగ రుణాలకు, వాటి అనుబంధ రుణాలకు పెద్దపీట వేసింది. గతంలో ఎప్పుడూ లేనివిధంగా ఈ ఆర్థిక సంవత్సరంలో కౌలు రైతులకే రూ.200 కోట్ల రుణాలు ఇవ్వాలని నిర్ణయించారు. రుణాల విషయంలో బ్యాంకులు ఉదారంగా ఉండాలని ప్రభుత్వం బ్యాంకర్లకు సూచించింది. గతంలో కౌలు రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులు ఈ దఫా ఎట్టి పరిస్థితుల్లోనూ ఉండకూడదని స్పష్టమైన మార్గదర్శకాలను ప్రభుత్వం జారీచేసింది. ఈ నేపథ్యంలో తాజా వార్షిక పద్దులో ప్రకటించిన వేల కోట్ల రుణాలు ఈసారైనా రైతులకు అంది. వారి అధిక వడ్డీ కష్టాలు తీరి బలవన్మరణాలు తగ్గుతాయనే ఆకాంక్ష సర్వత్రా వ్యక్తమవుతోంది.

**వ్యవసాయ రుణాలు రూ. 10,053 కోట్లు**

2024-25 ఆర్థిక సంవత్సరానికి పంట రుణాలతో పాటు వ్యవసాయ అనుబంధ రంగాలకు అన్నింటికి కలిపి రూ.10,053 కోట్లు అందించాలని వార్షిక పద్దులో ప్రకటించారు. దీనిలో ఖరీఫ్, రబీ రెండు సీజన్లు కలిసే ఉన్నాయి. ఖరీఫ్‌కు పంట రుణాలు రూ. 3,750 కోట్లను అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

దీనిలో ఇప్పటివరకు రూ.1850 కోట్లను అందించగా, వ్యవసాయ అనుబంధ సేవలకు కలిపి ఇప్పటికే రూ.3250 కోట్లను రుణాలుగా ఇచ్చినట్లు బ్యాంకు వర్గాలు చెబుతున్నాయి. రబీ సీజనుకు వచ్చేసరికి రూ.2.502 కోట్లును రుణాలను అందించాలని వార్షిక పద్దులో పేర్కొన్నారు. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే వ్యవసాయ రుణాలలో 15 శాతం వృద్ధి నమోదవడం రైతులపై ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనంగా కనబడుతోంది.

**కౌలు రైతులకే రూ.200 కోట్లు**

ఈసారి ఒక్క కౌలు రైతుల రుణ వాటానే రూ. 200 కోట్లకు ప్రభుత్వం పెంచేసింది. దీనికి తగ్గట్లే సీసీఆర్ కార్డుల విషయంలో కూడా ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తూ కౌలు రైతుల విషయంలో ప్రత్యేక శ్రద్ధను ప్రభుత్వం కనబరుస్తోంది. గడచిన ఐదేళ్ళలో కౌలు రైతులకు అందిన మొత్తం రుణాలు రూ.150 కోట్లు లోపే కావడం గమనార్హం. వాస్తవానికి పంట రుణాల మొత్తం పద్దులో 5 శాతం కౌలు రైతులకు రుణాలుగా అందించాలన్నది ప్రభుత్వాల ఉద్దేశం. ఐదేళ్లలో కౌలు రైతులకు జరిగిన అన్యాయాన్ని సరిచేసే క్రమంలో భాగంగా ఈ ఆర్థిక సంవత్సరంలోనే రూ.200 కోట్ల రుణాలను వారికి అందించాలని ప్రభుత్వం నిర్ణయించడంపై పలుమార్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ■

అధికారం, ధనం జీవన ఫలాలు ; కుటుంబం, మిత్రులు జీవన మూలాలు, మూలం లేని ఫలం మరణం!

# పది రెట్లు ఆదాయం అందించే వెదురు సాగు!

వెదురు సాగు చేసే అన్న జాతకు ఎదురే లేదు. 20 వేల రూపాయల పెట్టుబడితో ఏటా 2 లక్షల రూపాయల వరకు ఆదాయం పొందవచ్చు. జాతీయ వెదురు మిషన్ సహకారంలో ఉద్యాన శాఖ ఆకర్షణీయమైన సబ్సిడీలు ఇచ్చి ప్రోత్సహిస్తుండడంతో ఇప్పటికే జిల్లాలో కొందరు రైతులు సాగులో రాణిస్తున్నారు.

వెల్దుర్తి, మద్దికెర, అస్పరి మండలాల్లో వెదురును గట్ల వెంట సాగు చేస్తున్నారు. ఇక ఈ ఏడాదీ 20 హెకార్లలో వెదురు నాటించేందుకు ఉద్యానశాఖ.. జిల్లా అధికారులకు. ప్రతిపాదనలు పంపించి ఆమోదం అభించిన వెంటనే కార్యాచరణకు ఉపక్రమించనుంది.

**వెదురు సాగుకు ప్రతిపాదనలు**

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జిల్లాలో వెదురు సాగు ప్రోత్సహించేందుకు చేసిన కనరుత్తు ఇప్పుడు ఫలిస్తోంది. వెదురు సాగు కోసం యూనిట్ కాస్ట్, సబ్సిడీలు తదితర వాటిపై ప్రభుత్వం కోరిన మేరకు ఇటీవల జిల్లా ఉద్యానశాఖ ప్రతిపాదనలు పంపింది.

వెదురును గట్ల వెంట కానీ, పొలం మొత్త కానీ సాగు చేయొచ్చు. మొదట 2024–25 ఏడాదికి ప్రయోగాత్మకంగా 5 ఎకరాల్లో 'గట్ల వెంట (బార్డర్ (క్రాప్), మరో 20 హెక్టార్లలో ప్రధాన పంటగా సాగని కోసం ప్రతిపాదనలు పంపారు.

**సబ్సిడీలు ఇలా..**

వెదురు సాగును జాతీయ బ్యాంబూ మిషన్ ప్రోత్స హిస్తోంది. రెవెన్యూ సిబ్బంది లేదా గ్రామ పంచాయతీలు ప్రభుత్వ భూముల్లో బ్లాక్ పాంటేషన్ తరహాలో చేపడితే 100 శాతం సబ్సిడీ లభిస్తుంది.

రైతులు తమ పొలాల చుట్టూ(బార్డర్) లేదా పొలంలో (బ్లాక్ ప్లాంటేషన్) సాగు చేసుకుంటే హెక్టారుకు యూనిట్ కాస్ట్ రూ.1 లక్ష ఉండగా 50 శాతం సబ్సిడీ లభిస్తుంది.

ఇక రానున్న రోజుల్లో వెదురు నర్సరీలను కూడా ప్రోత్సహించనుంది. 2 హెక్టార్లలో వెదురు నర్సరీ ఏర్పాటు చేసుకుంటే యూనిటీ కాస్ట్ రూ. 30 లక్షలు, హెక్టారులో నర్సరీ పెట్టుకుంటే యూనిట్ కాస్ట్ రూ.18 లక్షలు, అర హెక్టారులో నర్సరీ పెట్టుకుంటే యూనిట్ కాస్ట్‌రూ.10లక్షలు ఉంటుంది. సబ్సిడీ 50శాతం ఉంటుంది.

**రైతులకు అవగాహన కల్పిస్తున్నాం**

జిల్లాలో వెదురుసాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. వెదురు అటవీ జాతి మొక్క. దీనిని పొలాల చుట్టూ నాటుకోవచ్చు. పొలంలో పంటగా కూడా సాగు చేసుకోవచ్చు. గ్రామ పంచాయతీలకు ఆదాయాన్ని పెంచుకునేందుకు ప్రభుత్వ భూముల్లో వెదురు మొక్కలు పెంచుకుంటే 100 శాతం సబ్సిడీ లభిస్తుంది. రైతులకైతే 50 శాతం సబ్సిడీ లభిస్తుంది.

– పి.రామాంజనేయులు

జిల్లా ఉద్యాన అధికారి, కర్నూలు

**ఇవీ ప్రయోజనాలు...**

జాతీయ మార్కెట్లో వెదురుకు ఉన్న ప్రాధాన్యత అంతాఇంతా కాదు. వెదురును కొయ్య బొమ్మలకు, పేపర్ తయారీకి ఉపయోగిస్తారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ నికరాదాయాన్ని ఇచ్చే పంట వెదురు. వెదురు అమ్మకం వల్ల వచ్చే లాభాలను పక్కనపెడితే ఇతరత్రా పంటలకు అనేక ప్రయోజనాలున్నాయి. గట్ల వెంట వెదురు మొక్కలు నాటుకుంటే ప్రధాన పంటలకు గాలుల నుంచి రక్షణతో పాటు భూమి కోతకు గురికాకుండా నివారిస్తుంది.

వెదురు జీవిత కాలం 30 ఏళ్ల నుంచి 100 ఏళ్లు. ఎకరాకు రూ.20 వేలు పెట్టుబడి పెడితే ఏడాదికి రూ.2 లక్షల వరకు ఆదాయం ఉంటుంది. 3వ ఏడాది నుంచి దిగుబడి మొదలై ఏడాది నుంచి దిగుబడి గరిష్ఠ స్థాయికి చేరుతుంది. ■

# ఏపిలో స్వయం సహాయ మహిళలకు 5 లక్షల రుణం

**ఆం**ధ్రప్రదేశ్‌లో ఎస్సీ, ఎస్టీ స్వయం సహాయ (డ్వాక్రా) మహిళలకు సంబంధించి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 'ఉన్నతి' పథకం కింద స్వయం సహాయ మహిళలకు ఇచ్చే వడ్డీలేని రుణాల పరిమితిని రూ.5 లక్షలకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. మొన్నటి వరకు ఈ పథకం కింద వారికిచ్చే సున్నా వడ్డీ రుణాల పరిమితి 2 లక్షల రూపాయలు మాత్రమే. ఇప్పుడు ప్రభుత్వం దానిని రూ.5 లక్షలకు పెంచింది. మహిళల జీవనోపాధి కింద ఒక్కొక్కరికి కనిష్టంగా 50 వేల రూపాయల నుంచి గరిష్టంగా 5లక్షల రూపాయల వరకు వడ్డీలేని రుణాన్ని ఇస్తారు.

స్వయం సహాయ మహిళలు ఈ రుణాన్ని వాయిదాల పద్ధతిలో తిరిగి చెల్లిస్తారు. 2024–25 ఏడాదికి సంబంధించి 250 కోట్లు రూపాయలు రుణంగా ఇవ్వాలని అధికారులు టార్గెట్‌గా పెట్టుకున్నారు.

ఇప్పటికే ఈ ఫైల్‌పై ఎమ్ఎస్ఎమ్ఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాలశాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సంతకం చేశారు. ఈ ఉన్నతి పథకం కింద రుణం మంజూరుకు కార్యాచరణ ప్రణాళికను అధికారులు సిద్ధం చేస్తున్నారు.

స్వయంసహాయ సంఘాల్లో సభ్యులుగా ఉన్న ఎస్సీ, ఎస్టీ మహిళలు ఈ రుణం కోసం దరఖాస్తు చేసుకున్న నెల రోజులలో యూనిట్ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. రాష్ట్రంలో గ్రామ సంఘం స్థాయి నుంచి అన్ని దశల్లోనూ పర్యవేక్షణ ఉంటుంది. అలాగే లబ్ధిదారులు ఎంపిక చేసుకున్న జీవనోపాధికి అనుగుణంగా రుణం మంజూరు చేస్తారు. ఏ జీవనోపాధి ఏర్పాటు చేసుకోవాలనేది స్వయంసహాయ మహిళల ఇష్టం.

మొన్నటి వరకు ఉన్నతి పథకం కింద రుణాల మంజూరు గృహ నిర్మాణానికి, విద్యకు, భూమి కొనుగోలుకు వర్తించదు. స్వయంసహాయ మహిళల నుంచి వచ్చిన విజ్ఞప్తులతో విద్య, గృహ నిర్మాణానికి, భూమి కొనుగోలుకు కూడా వర్తింపచేయాలని అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించారు. ఎస్సీ కార్పొరేషన్ నుంచి 8 కోట్ల రూపాయల మేర నిధుల్ని రాయితీ కింద స్వయం సహాయ మహిళలకు అందించే అవకాశం ఉంది. ప్రభుత్వం ఈ అంశంపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

ఈ ఉన్నతి పథకం స్వయంసహాయ సంఘాల్లోని ఎస్సీ, ఎస్టీ మహిళల అభ్యున్నతి కోసం తీసుకొచ్చిన పథకం. మహిళలు ఈ రుణాలు తీసుకుని చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ అభివృద్ధి సాధించేలా చూడాలనేది లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పుడు తాజాగా ప్రభుత్వం రుణ పరిమితిని రూ.5 లక్షల వరకు పెంచడంతో వారికి మరింత ఊరట లభించింది. కొత్త ప్రభుత్వం అధికారంలోకి రావడంతో బడ్జెట్ నుంచి మరో 250 కోట్ల రూపాయల నిధులకు ప్రతిపాదనలు పంపించారు. ప్రస్తుతం ఉన్న 250 కోట్ల రూపాయల నిధులకు అదనంగా మరో 250 కోట్ల రూపాయలు తోడైతే 500 కోట్ల రూపాయల మేర రుణాలు.. ఎస్సీ, ఎస్టీల మహిళలకు ఒక్క ఏడాదిలోనే అందించే అవకాశం ఉంటుంది అని అంటున్నారు. ■

## ఖర్జూరం సాగుకు ప్రోత్సాహం

*__రా__ష్ట్రంలో ఖర్జూరం సాగును ప్రోత్సహిస్తామని వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు చెప్పారు. రాయల సీమకు చెందిన ఖర్జూర సాగు రైతులు సచివాలయంలో మంత్రిని కలిసి, సమస్యలు చెప్పుకున్నారు. 700 ఎకరాల్లో ఉన్న ఖర్జూర సాగుకు రాయితీపై బిందు సేద్య పరికరాలు ఇవ్వాలని, మొక్కల ఖర్చు తగ్గించాలని కోరారు. దీనిపై మంత్రి స్పందిస్తూ 'ఉపాధి హామీ పథకంలో ఖర్జూర సాగును ప్రోత్సహించి, రైతులకు సూక్ష్మ సేద్య సౌకర్యాన్ని రాయితీపై కల్పిస్తామని' చెప్పారు.* ■

**ఆలోచనలు మారవచ్చు కాని సిద్ధాంతం కాదు, ఆకులు రాలవచ్చు కాని మూలం నశించకూడదు**

# మానవాళికి ఎక్కువ మేలుచేసే చెట్లు యివే!

**మా**నవాళికి ఎక్కువ లబ్ది చేకూరాలంటే ఏయే చెట్లు నాటాలి? ఈ విషయమై స్కంద పురాణంలో ఒక చక్కని శ్లోకం ఉంది.

'అశ్వత్థమేకం పిచుమందమేకం
న్యగ్రోధమేకం దశ తిన్త్రిణీకం
కపిత్థ బిల్వామలక త్రయాంచ
పంచామ్రవాపీ నరకన్ న పశ్యేత్

| చెట్టు ... గ్రహించే కార్బన్ డయాక్సైడ్ శాతం ...నాటే సంఖ్య | | |
|---|---|---|
| అశ్వత్థ = రావి చెట్టు | (100%) | 1 |
| పిచుమందా = నిమ్మ చెట్టు | (80%) | 1 |
| న్యగ్రోధ = మర్రి చెట్టు | (80%) | 1 |
| తింత్రిణి = చింత చెట్టు | (80%) | 10 |
| కపిత్థ = వెలగ చెట్టు | (80%) | 3 |
| బిల్వ = మారేడు చెట్టు | (85%) | 3 |
| ఆమలక = ఉసిరి చెట్టు | (74%) | 3 |
| ఆమ్ర = మామిడి చెట్టు | (70%) | 5 |

ఈ చెట్లను నాటడంతో పాటు వాటికి నీటికోసం ఒక బావిని (వాపి) తవ్వించి, సంరక్షించే వారు నరకానికి పోవలసిన అవసరం ఉండదని ఈ శ్లోక భావం.

ఈ సహజ సిద్ధమైన విషయాలను పాటించకపోవడం వల్లే ఈరోజు వాతావరణంలో నరకాన్ని చూస్తున్నాం. అయినా, మించిపోయిందేమీ లేదు, మన తప్పును మనం సరిదిద్దుకోవచ్చు.

గుల్మోహర్, నీలగిరి లాంటి చెట్లు మన దేశ పర్యావరణానికి ప్రాణాంతకం. పాశ్చాత్య దేశాలను గుడ్డిగా అనుకరించడం వల్ల మనకు మనమే గొప్ప హాని చేసుకుంటున్నాం.

రావి, మోదుగ, వేపవంటి మొక్కలు నాటడం ఆగిపోవడంతో కరువు సమస్య పెరుగుతోంది. ఈ చెట్లన్నీ వాతావరణంలో ఆక్సిజన్‌ను పెంచుతాయి. అలాగే, ఇవి భూమి ఉష్ణోగ్రతను తగ్గిస్తాయి.

ఈ చెట్లను పూజించే సంప్రదాయాన్ని మూఢ నమ్మకాలుగా భావించి, విదేశీ సంస్కృతి పేరుతో ఈ చెట్లను దూరం చేసుకుని రహదార్లకు ఇరువైపులా గుల్మోహర్, యూకలిప్టస్ (నీలగిరి) చెట్లను నాటడం ప్రారంభించాం.

యూకలిప్టస్ త్వరగా పెరుగుతుంది, కానీ ఈ చెట్లను చిత్తడి నేలను ఆరబెట్టడానికి నాటుతారు. ఈ చెట్లవల్ల భూమిలో నీటి మట్టం తగ్గుతుంది. గత 40 ఏళ్లలో యూకలిప్టస్ చెట్లను విరివిగా నాటడం వల్ల పర్యావరణం దెబ్బతింది.

గ్రంథాలలో రావి చెట్టుని చెట్లరాజు అని పిలుస్తారు.

'మూలే బ్రహ్మా చర్మం విష్ణు శాఖ శంకరమేవచ
పత్రే పత్రే సర్వదేవోయం వృక్ష రాజ్ఞో నమోస్తుతే'

**భావం:** ఏ మూలంలో బ్రహ్మ, కాండములో విష్ణువు, శాఖలలో శంకరుడు, ఆకులలో సర్వ దేవతలు నివసిస్తారో అటువంటి వృక్షరాజం రావికి నమస్కారాలు.

రాబోయే సంవత్సరాల్లో ప్రతి 500 మీటర్లకు ఒక రావి, మర్రి, వేప తదితర చెట్లను నాటితేనే మన భారతదేశం కాలుష్య రహితంగా మారుతుంది. తులసి మొక్కలను ప్రతి ఇంటిలో నాటాలి. మన సంఘటిత ప్రయత్నాల ద్వారానే మన భారతదేశాన్ని ప్రకృతి వైపరీత్యాల నుండి కాపాడు కోగలం. భవిష్యత్తులో మనకు సహజ ప్రాణవాయువు సమృద్ధిగా అందేలా ఈరోజు నుంచే ప్రచారం ప్రారంభిం చాల్సిన అవసరం ఉంది. రావి, మఱ్ఱి, మారేడు, వేప, ఉసిరి, మామిడి మొక్కలు నాటడం ద్వారా రాబోయే తరానికి ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన పర్యావరణాన్ని అందించడానికి ప్రయత్నిద్దాం. ■

నీలో మార్పు రాకుండా ఇతరులలో మార్పు రావాలనుకోవడం అత్యాశ

# ప్రకాశం జిల్లా డ్వామా పీడీపై విచారణ

**జి**ల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) పీడీ అర్జున్‌రావు అవినీతిపై ప్రకాశం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా విచారణకు ఆదేశించారు. విచారణాధికారిగా జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణను నియమించినట్లు సమాచారం. డ్వామా పీడీగా అర్జున్‌రావు బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి మామూళ్ల కోసం వేధించడంతో పాటు మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపిస్తూ ఉద్యోగులు రోడ్డెక్కిన విషయం తెలిసిందే. పీడీ కారణంగా తాము ఎదుర్కొంటున్న సమస్యలను వినతిపత్రం రూపంలో కలెక్టర్ తమీమ్ అన్సారియాకు సమర్పించారు. ఉద్యోగులతో ఆయా అంశాలపై మాట్లాడిన కలెక్టర్ అన్సారియా పీడీ అవినీతికి సంబంధించిన అంశాలపై ఆధారాలు ఉన్నాయా? అని ప్రశ్నించినట్లు సమాచారం. తమనే కాకుండా కొందరు ఎంపీడీవోలను సైతం వేధించినట్లు ఈ సందర్భంగా వారు వివరించారు. మండలం నుంచి నెలకు లక్ష రూపాయలు మామూళ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని, లేని పక్షంలో ఆయా ఉద్యోగులను టార్గెట్ చేసి అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని కలెక్టర్ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు.

దీంతో కలెక్టర్ అన్సారియా.. జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణతో సమగ్ర విచారణ చేయిస్తానని హామీ ఇచ్చినట్లు సమాచారం. కాగా డ్వామాలో పని చేసే అన్ని విభాగాల ఉద్యోగులు రోడ్డెక్కి ఆందోళన చేయడం, పత్రికల్లో ప్రముఖంగా రావడంతో కలెక్టర్ స్పందించి అందుకు సంబంధించి పీడీ అర్జునరావును వివరణ కోరినట్లు సమాచారం.

కాగా తమ శాఖలో పనిచేసే ఉద్యోగులు తనకు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టడంతో కార్యాలయానికి రాకుండా ఆయన ముఖం చాటేసినట్లు తెలిసింది. ఉద్యోగులు సమావేశమై ఆందోళనలు చేస్తారని తెలిసిన వెంటనే పీడీ అర్జునరావు అన్ని విభాగాల ఉద్యోగుల్లోని ముఖ్యనాయకులతో మాట్లాడినట్లు సమాచారం. ఇక నుంచి అటువంటివి జరగకుండా చూసుకుంటానని, ఆందోళనలు చేయవద్దని కోరినట్లు తెలిసింది. కానీ ఉద్యోగులు ఆయన వేధింపుల నుంచి రక్షణ కల్పించాలని రోడ్డెక్కడంతో డ్వామా అధికారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచిచూడాల్సిందే. ■

## నూరు శాతం రాయితీపై ఆయిల్‌పామ్ మొక్కలు

*ఉద్యానవన శాఖ ద్వారా ఆయిల్‌పామ్ సాగు చేపట్టే రైతులకు వంద శాతం రాయితీపై హెక్టారుకు రూ. 29 వేల విలువైన 143 మొక్కలను రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. శనివారం అవనిగడ్డ మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ సాగుపై ఉద్యానవన, వ్యవసాయ సహాయ సిబ్బందికి నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు.*

*ఆయిల్‌పామ్‌లో అంతర పంటలకు హెక్టారుకు ఏడాదికి రూ. 5,250 చొప్పున నాలుగేళ్లలో రూ. 21 వేలు రాయితీ లభిస్తుందని తెలిపారు. చాఫ్ కట్టర్, వర్మీ కంపోస్టు యూనిట్లు, వైర్ మెష్‌పై 50 శాతం, డ్రిప్ ఇరిగేషన్‌కు 50 శాతం రాయితీ ఇస్తున్నారని, రైతులు వినియోగించుకోవాలని సూచించారు. ఆయిల్‌పామ్ పంటకు ప్రకృతి విపత్తుల నుంచి ఎలాంటి నష్టం రాదని తెలిపారు. ఆయిల్ పామ్ సాగు ప్రయోజనాలు– మార్కెట్ అవకాశాలపై జిల్లా రైతులకు అవగాహన కల్పించేందుకు జూలై 15 నుంచి సెప్టెంబరు 15 వరకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఎంపీపీ తుంగల సుమతి, ఉద్యానవన శాఖ జిల్లా అధికారి జె.జ్యోతి, ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ జి.విజయలక్ష్మి, ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త వి.మంజువాణి, అవనిగడ్డ ఉద్యానశాఖ అధికారి ఎన్.రమేష్ పాల్గొన్నారు.* ■

# తెలంగాణాలో రెట్టింపుగా చిరుధాన్యాల సాగు!

రాష్ట్రంలో చిరుధాన్యాల సాగు ఆశాజనకంగా మొదలైంది. ప్రజల్లో ఆదరణ పెరగడం.. మంచి ధరలు రావడం.. సాగువ్యయం తక్కువగా ఉండడం.. చీడపీడలను తట్టుకుని అధిక దిగుబడులు వస్తుండటంతో రైతులు ఈ పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో మునుపెన్నడూ లేనివిధంగా విత్తనాల క్రయవిక్రయాలు భారీగా జరిగాయి. వర్షాభావ పరిస్థితులున్నా రాష్ట్రంలో చిరుధాన్యాల సాగు విస్తీర్ణం ఈ నెలలో పెరిగింది. గత యాసంగి సీజన్లో రాష్ట్రంలో 2.46 లక్షల ఎకరాల్లో చిరుధాన్యాలు సాగయ్యాయి. ప్రస్తుత వానాకాలం సీజన్ లో 4.5 లక్షల ఎకరాల్లో సాగయ్యే అవకాశం ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ సీజన్‌లో జూన్ చివరి నాటికి జొన్నలు 13.422 ఎకరాలు, సజ్జలు 10 వేలు, రాగులు 2,526 కొర్రలు, సామలు, ఇతర చిరుధాన్యాలు 4,200 ఎకరాల్లో సాగు మొదలైంది.

**సాగుతో భరోసా..**

యాసంగిలో అనూహ్య వాతావరణ మార్పుల నేపథ్యంలో అధిక ఉష్ణోగ్రతలు, అకాల వర్షాలు, వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. వాటిని చిరుధాన్య పంటలు తట్టుకున్నాయి. పత్తి, వరి వంటి ప్రధాన పంటలతో పోలిస్తే చిరుధాన్యాల సాగు ఖర్చు 39 శాతం తక్కువగా ఉంది. చిరుధాన్యాల కంటే ప్రధాన పంటల విత్తనాల ధర కూడా 43 శాతం ఎక్కువగా ఉంది. చిరుధాన్య పంటలకు సాగునీరు, ఎరువుల అవసరం కూడా తక్కువే ఎక్కువగా సేంద్రియ ఎరువులతోనే సాగవుతున్నాయి. కూలీల అవసరం కూడా తక్కువే.

**ప్రయోజనాలెన్నో..**

చిరుధాన్యాలు గోధుమల కంటే 3 నుంచి 5 రెట్లు పోషకాలు కలిగి ఉంటాయి. కాల్షియం, ఐరన్, పొటాషియం, మెగ్నీషియం, జింక్ కల్గి ఉండడంతో పాటు గ్లూటెన్ లేకుండా ఉంటాయి. మద్దతుధర క్వింటాలుకు జొన్నలకు రూ.2,970, సజ్జలకు రూ.2,350, రాగులకు రూ.3,578 ఉండగా అంతకంటే అధికంగా మార్కెట్లో ధరలు లభిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడంతో వాటికి డిమాండ్ ఏర్పడింది.

2023ను ఐరాస అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దీనిపై విస్తృతప్రచారం చేసి అన్నదాతలకు వాటి ప్రాధాన్యంపై అవగాహన కల్పించడం వంటి పరిస్థితులు సాగు పెరుగుదలకు దోహదం చేస్తున్నాయి.

**సబ్సిడీపై విత్తనాలు..**

రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చిరుధాన్యాల విత్తన ధరలో 65% రాయితీ ఇస్తోంది. కేంద్రం జాతీయ ఆహార భద్రతా మిషన్ కింద మరో 25% రాయితీ ఇస్తోంది. మొత్తంగా విత్తన ధరలో 90% రాయితీ లభిస్తోంది.

జీవ వైవిధ్యం, పర్యావరణ హితం దృష్ట్యా పెద్దఎత్తున చిరుధాన్యాల సాగు, ఉత్పత్తి, ఉత్పాదకత పెంచేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. పోషక విలువలున్న ఆహారంగా చిరు ధాన్యాలను అంగన్వాడీలు, ప్రభుత్వ పాఠశాలలు, గురు కులాలు, వసతిగృహాలకు సరఫరా చేయాలనే ప్రతిపాదన పరిశీలనలో ఉంది.

**చిరుధాన్యాల సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)..**

| పంట | 2023-24 యాసంగిలో.. | 2024 వానా కాలంలో(అంచనా) |
|---|---|---|
| జొన్నలు | 2,32,992 | 3,50,000 |
| సజ్జలు | 13,117 | 50,000 |
| రాగులు | 4,459 | 20,000 |
| కొర్రలు | 2.370 | 10,000 |
| సామలు, ఊదలు, అరికెలు తదితరాలు | 5,067 | 20,000 |

■

# మహిళల పేరిట కొనే ఆస్తులపై తగ్గనున్న సుంకం!

**మ**హిళల పేరిట కొనుగోలు చేసే ఆస్తులపై సుంకాన్ని మరింతగా తగ్గించడంపై కేంద్రం దృష్టి సారిస్తోందని కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. ఈ విధానాన్ని పట్టణాభివృద్ధి పథకాల్లో భాగంగా చేయనున్నట్లు తెలిపారు. పన్ను ప్రయోజనాలకు సంబంధించి ఆధార్ నంబర్ స్థానంలో ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ ఐడీని వినియోగించే పద్ధతిని నిలిపివేయాలని ఆమె ప్రతిపాదించారు. భారీ స్టాంప్ డ్యూటీ వసూలు చేసే రాష్ట్రాలను తగ్గించేలా సూచిస్తామని.. మహిళలు కొనుగోలు చేసే ఆస్తులపై సుంకాలను మరింతగా తగ్గించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

**పేదల సొంతింటి కలకు చేయూత..**

యూనియన్ బడ్జెట్ 2024 – పట్టణాల్లో నివసించే ప్రజల సొంతింటి కలను నిజం చేసేలా బడ్జెట్లో కేంద్రం పెద్దపీట వేసింది! ఇందుకోసం ఉద్దేశించిన ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పిఎం ఆవాస్ యోజన అర్బన్ 2.0) పథకానికి ఐదేళ్లకు గాను రూ. 2.2 లక్షల కోట్లు మేర సాయాన్ని బడ్జెట్లో ప్రతిపాదించింది.

దేశంలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఈ పథకం కింద మూడు కోట్ల అదనపు ఇళ్లను ప్రకటించామని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. పీఎం ఆవాస్ యోజన 2.0లో భాగంగా రూ. 10 లక్షల కోట్ల పెట్టుబడితో కోటి మంది పట్టణ పేద, మధ్యతరగతి కుటుంబాల గృహ అవసరాల్ని తీర్చేందుకు ఆర్థిక సాయం, వడ్డీ రాయితీలు కల్పించనున్నట్లు నిర్మలా సీతారామన్ వెల్లడించారు. పేద, మధ్యతరగతి ప్రజల ఇళ్ల నిర్మాణం కోసం ప్రకటించిన నిధులతో పట్టణ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణం కోసం తీసుకొనే రుణాలపై వడ్డీ రాయితీ పథకాన్ని అమలు చేయనున్నట్లు నిర్మలా సీతారామన్ తెలిపారు.

**కార్మికుల కోసం అద్దె గృహాల నిర్మాణం..**

దేశంలో రెంటల్ హౌసింగ్ మార్కెట్లను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం విధానాలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. అద్దె ఇళ్ల లభ్యతని పెంచడంతో పాటు పారదర్శకత, నాణ్యత పెంపుపై దృష్టి సారిస్తామన్నారు. పారిశ్రామిక ప్రాంతాల్లో పనిచేసే కార్మికులకు డార్మిటరీ తరహా వసతితో అద్దె గృహాలను నిర్మిస్తామన్నారు. దీన్ని ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో చేపట్టనున్నట్లు తెలిపారు. దేశంలో 30 లక్షల జనాభా పైబడిన ఎంపిక చేసిన నగరాల్లో వీక్లీ హట్ (వారాంతపు అంగళ్లు) లేదా స్ట్రీట్ ఫుడ్ హబ్లను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ■

## కోటక్ కన్య స్కాలర్‌షిప్

**కో**టక్ మహీంద్రా గ్రూప్ కంపెనీలు, కోటక్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఉమ్మడిగా నిర్వహిస్తున్న కోటక్ కన్య స్కాలర్‌షిప్ 2024–25' నోటిఫికేషన్ వెలువడింది. ప్రతిభావంతులైన బాలికలను ఉన్నత విద్యలో ప్రోత్సహిస్తూ వారికి ఆర్థిక సహకారాన్ని అందించేందుకు ఈ స్కాలరిప్‌ను ఉద్దేశించారు. కనీసం 75 శాతం మార్కులతో ఇంటర్/పన్నెండో తరగతి పూర్తి చేసి గుర్తింపు పొందిన కాలేజీల్లో ఇంజనీరింగ్/మెడిసిన్/బీడీఎస్/పార్మసీ/ఆర్కిటెక్చర్/డిజైనింగ్ విభాగాల్లో డిగ్రీ ప్రవేశం పొందిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎల్ఎల్బీ, బీఎస్సీ నర్సింగ్ వంటి ప్రొఫెషనల్ కోర్సుల్లో చేరినవారు, బెంగళూరు ఐఐఎస్సీ, ఐసర్ సంస్థల నుంచి ఇంటిగ్రేటెడ్ బీఎస్–ఎంఎస్ అడ్మిషన్ పొందినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. కుటుంబ వార్షిక ఆదాయం రూ. 6 లక్షలు మించకూడదు. ఎంపికైన బాలికలకు ట్యూషన్ ఫీజు, హాస్టల్ ఫీజు, ఇంటర్నెట్, ల్యాప్‌టాప్, బుక్స్, స్టేషనరీ ఖర్చుల కింద ఏడాదికి రూ. లక్షన్నర ఇస్తారు. వార్షిక పరీక్షల్లో కనీసం 6 సీజీపీఏ సాధించేవారికి కోర్సు పూర్తయ్యేవరకూ స్కాలర్షిప్ కొనసాగిస్తారు.

దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 30

వెబ్‌సైట్ : www.kotak.com, www.b4s.in/it/kkgs2 ■

మార్పును తిరస్కరించేవాడు వినాశనం కోరుకునేవాడే ; అభివృద్ధి కోరుకోనిది ఒక్క శ్మశానం మాత్రమే !

# రక్తంలో కొలెస్ట్రాల్ నియంత్రణకు మార్గదర్శకాలు

**ర**క్తంలో కొలెస్ట్రాల్ స్థాయిల అసాధారణ హెచ్చు తగ్గులను (డిస్లిపిడెమియా) నివారించేందుకు దోహదపడేలా కార్డియోలాజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా (సీఎస్ఐ) మన దేశంలో తొలిసారి మార్గదర్శకాలను జారీ చేసింది.

రక్తంలో మొత్తంగా కొలెస్ట్రాల్ అధికంగా ఉండటం, ఎల్‌డీఎల్ - కొలెస్ట్రాల్ (చెడు కొలెస్ట్రాల్) ఎక్కువవడం, ట్రైగ్లిసరైడ్స్ అధికం అవడం, హెచ్‌డీఎల్ - కొలెస్ట్రాల్ (మంచి కొలెస్ట్రాల్) తక్కువవడం వంటివి డిస్లిపిడెమియా పరిధిలోకి వస్తాయి.

గుండె పోటు, పక్షవాతం తదితర గుండె సంబంధిత వ్యాధులకు అది దారి తీస్తుంటుంది. ఇది నిశ్శబ్ద హంతకిలాంటిదని సీఎస్ఐ అధ్యక్షుడు డాక్టర్ ప్రతాప్‌చంద్ర రథ్ తెలిపారు. అధిక రక్తపోటు, మధుమేహం వంటి సమస్యల తరహాలో దీని లక్షణాలు ముందుగా బయటపడవని పేర్కొన్నారు.






రక్తంలో కొలెస్ట్రాల్‌ల స్థాయిలను నియంత్రణలో ఉంచుకునేందుకు తమ మార్గదర్శకాలు దోహదపడతాయని వివరించారు.

**తాజా మార్గదర్శకాల ప్రకారం..**

- గుండె జబ్బులు వంశపారంపర్యంగా వస్తున్న కుటుంబాలకు చెందినవారు, రక్తంలో మొత్తం కొలెస్ట్రాల్ స్థాయిలు ఎక్కువగా ఉండే (హైపర్ కొలెస్టెరోలెమియా) కుటుంబాలకు చెందినవారు తొలి లిపిడ్ ప్రొఫైల్‌ను 18 ఏళ్ల లేదా అంతకంటే తక్కువ వయసులోనే చేయించుకోవాలి.
- సాధారణ ప్రజలు, ముప్పు తక్కువగా ఉన్నవారు ఎల్‌డీఎల్ - సీ స్థాయిలను 100 ఎంజీ / డీఎల్‌కు, నాన్ -హెచ్‌డీఎల్ - సీ స్థాయిలను 130 ఎంజీ/ డీఎల్‌కు తక్కువగా ఉండేలా చూసుకోవాలి.
- ముప్పు ఎక్కువగా ఉన్న వ్యక్తులు (మధుమేహం, రక్త పోటు వంటి సమస్యలు ఉన్నవారు) ఎల్ డీ ఎల్ -సీ స్థాయిలు 70 ఎంజీ/డీఎల్‌కు, నాన్ - హెచ్‌డీఎల్-సీ స్థాయిలు 100 ఎంజీ / డీఎల్‌కు లోబడి ఉండేలా జాగ్రత్త పడాలి.
- ముప్పు అత్యధికంగా ఉన్నవారైతే (పక్షవాత బాధితులు, గుండెపోటు బారిన పడ్డవారు, దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధుల బాధితులు) ఎల్‌డీఎల్ - సీ స్థాయిలు 55 ఎంజీ / డీఎల్‌కు, నాన్ - హెచ్‌డీఎల్ - సీ స్థాయిలు 85 ఎంజీ / డీఎల్‌కు తక్కువగా ఉండేలా జాగ్రత్త వహించాలి.
- ఆహారంలో చక్కెర, కార్బోహైడ్రేట్లను తక్కువగా తీసుకోవాలి.
- గుండె ఆరోగ్యాన్ని కాపాడే యోగా, వ్యాయామం వంటివి చేయాలి. ■

# ఉచిత గ్యాస్ సిలిండర్ల కోసం ఇలా చేయండి!

**కేం**ద్ర ప్రభుత్వం సిలిండర్ వినియోగదారులకు ఇకేవైసీ పూర్తి చేయాలని ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలకు ఆదేశాలు జారీ చేసింది. ఈ ప్రక్రియ 8 నెలల నుంచి జరుగుతూనే ఉంది. ఇప్పుడు కూడా కొనసాగుతోంది. తెలంగాణలో రూ.500కే గ్యాస్ సిలిండర్ స్కీమ్ పథకం ప్రకటన కారణంగా చాలా మంది గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ల వద్ద బారులు తీరారు. ఇకేవైసీ పూర్తి చేసుకున్నారు.

ఇప్పుడు ఏపీలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. కొన్ని ప్రాంతాల్లో గ్యాస్ సిలిండర్ వినియోగదారులు ఇకేవైసీ కోసం బారులు తీరుతున్నారు. లేదంటే ఉచిత గ్యాస్ సిలిండర్ రాదు ఏమో అని ఆందోళన చెందుతున్నారు.




అయితే ప్రభుత్వం ఇప్పటివరకు ఈ ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం అమలుపై ఎలాంటి ప్రకటన చేయలేదు. ప్రజలు మాత్రం ముందుగానే అప్రమత్తం అయిపోయారు. ఇకేవైసీ చేసుకోవడానికి బారులు తీరుతున్నారు.

కేంద్ర ప్రభుత్వం ఇటీవలనే ఇకేవైసీ అంశంపై కీలకమైన ప్రకటన చేసింది. ఇకేవైసీకి ఎలాంటి గడువు లేదని స్పష్టత ఇచ్చింది. అంటే ఇకేవైసీ అనేది నిరంతర ప్రక్రియగా మనం చెప్పుకోవచ్చు. కాని, జనాలు మాత్రం ఉచిత స్కీమ్ కింద సిలిండర్ రాకపోవచ్చేమో అనుకొని ముందుగానే ఇకేవైసీ పూర్తి చేసుకుంటున్నారు.

అయితే ఇకేవైసీ పూర్తి చేసుకోవడానికి గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ల వద్దకు వెళ్లి గంటల తరుబడి లైన్‌లో నిలపడవలసిన పని లేదు. ఇంటి నుంచే మీరు ఈ పని పూర్తి చేసుకోవచ్చు. ఎలానో తెలుసుకుందాం.

గ్యాస్ సిలిండర్ డెలివరీ బాయ్ కూడా మీ సిలిండర్ డెలివరీ సమయంలో ఇంటికి వచ్చి ఇకేవైసీ పూర్తి చేస్తారు. అందువల్ల మీరు వారి సేవలు కూడా ఉపయోగించుకోవచ్చు. లేదంటే మీ గ్యాస్ కంపెనీ మొబైల్ యాప్ ద్వారా కూడా మీరు ఇకేవైసీ పూర్తి చేసుకోవచ్చు. ఇలా ఎంతో సులభంగా. మీరు గ్యాస్ సిలిండర్ కనెక్షన్ ఇకేవైసీ పూర్తి చేయొచ్చు.

ఇంట్లో నుంచే మీరే ఇకేవైసీ పూర్తి చేసుకోవాలని భావిస్తే.. ముందుగా మీ గ్యాస్ కంపెనీ మొబైల్ యాప్‌ను ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాలి. తర్వాత లాగిన్ అవ్వాలి.




అందులో ఇకేవైసీ ఆప్షన్ ఉంటుంది. దీని ద్వారా ఆధార్ నెంబర్ ఎంటర్ చేసి, ఓటీపీ ఎంటర్ చేసి ఇకేవైసీ క్షణాల్లో పూర్తి చేయొచ్చు. ■

## ఆంధ్రప్రదేశ్‌లో ‘ మహాశక్తి ’!

**రా**ష్ట్రంలో 18 సంవత్సరాలు దాటిన మహిళలకు ఆర్థికసాయాన్ని అందజేసేందుకు మహాశక్తి అనే కొత్త పథకాన్ని ప్రభుత్వం రూపొందిస్తుందని, అందుకు అవసరమైన మార్గదర్శకాలను త్వరలోనే జారీ చేస్తామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిరిజన, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. ■

# వర్షాకాలం వ్యాధులను తెస్తుంది ... బహుపరాక్!

వర్షాకాలంలో పారిశుధ్య సమస్య తలెత్తడం వలన వ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉంది. జిల్లాలో అడపా దడపా కురుస్తున్న వర్షాల వలన వాతావరణంలో భిన్నమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయి. దీంతో వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉన్నందున వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్త మైంది. ముందస్తు చర్యలను చేపట్టి సిబ్బందికి శిక్షణ, ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. అధికారులు ఎన్ని చర్యలు చేపట్టినప్పటికి ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. ఇప్పటికే ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి.

మంచిర్యాల జిల్లాలో జనవరి నుంచి జూలై 14వ తేది వరకు 10,406 జ్వర కేసులు, జనవరి 31 జన్నారం పీహెచ్‌సీ పరిధిలోని కవ్వాల్‌లో ఒక యువతికి డెంగీ పాజిటివ్ కేసు నమోదైంది.

మంచిర్యాల జిల్లాలో 33 హైరిస్క్ గ్రామాలను వైద్య ఆరోగ్య శాఖ గుర్తించి వాటిపై దృష్టి సారించింది. వాతావరణ మార్పులతో ఉదయం చల్లదనం, మధ్యాహ్నం వేడి, సాయంత్రం వానతో ప్రజలు నానా ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ సీజన్‌లో డెంగీ, మలేరియా, చికెన్ గున్యా, వైరల్ జ్వరాలు వ్యాపిస్తాయి. వాతావరణంలో మార్పుల కారణంగా వ్యాధులు మరింత ఇబ్బంది పెట్టే ప్రమాదం పొంచి ఉన్నది. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తమై సర్వేలు మొదలుపెట్టారు.

**పారిశుధ్య సమస్యే కారణం....**

సీజనల్ వ్యాధులకు పారిశుధ్య సమస్యే కారణమవు తోంది. ఎక్కడి చెత్త అక్కడే ఉండిపోవడం, డ్రైనేజీలు పూడికతో నిండిపోవడం, మురుగు నీటి గుంతలు అలాగే ఉండిపోవడం వలన దోమలు వృద్ధి చెందుతున్నాయి. పంచాయతీ పాలకవర్గాల సమయం ముగిసిపోవడంతో ప్రత్యేకాధికారుల పాలన మొదలైంది. చాలా చోట్ల గ్రామ పంచాయితీ పారిశుధ్య సిబ్బంది తమ సమస్యలు పరిష్కరించాలని ఆందోళన చేపట్టారు. పాలకవర్గాలు లేక పంచాయతీల నిర్వహణ కష్టతరంగా మారింది.

దోమల నివారణకు ఫాగింగ్, మురుగు నీటి గుంతల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లడం వంటి పనులు మందకొడిగా సాగుతున్నాయి. అధికార యంత్రాంగం జిల్లాలోని 109 పాఠశాలు, హాస్టళ్లలో దోమల నివారణ మందును స్ప్రే చేయడం మొదలుపెట్టింది. జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు-17, అర్బన్ హెల్త్ సెంటర్లు-4, బస్తీ దవాఖానాలు-3, ఉపకేంద్రాలు-146, నిరంతరం పనిచేసే ఆరోగ్య కేంద్రాలు-9 ఉన్నాయి. ఆసుపత్రుల పరిధిలో వైద్య సిబ్బంది గ్రామాల్లో, పట్టణాలో ఇంటింటికి తిరిగి వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

**నివారణ చర్యలే ముఖ్యం...**

పారిశుధ్య లోపాన్ని నివారిస్తే వ్యాధుల వ్యాప్తిని నియంత్రించవచ్చు. నీరు నిలిచి ఉన్నచోట దోమలు వృద్ధి చెంది, ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో ఫాగింగ్ చేయడంలేదు. దీంతో జ్వరాల బారిన పడి ప్రైవేట్, ప్రభుత్వాసుల్లో రోగుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. ముఖ్యంగా డ్రైనేజీ వ్యవస్థలు అధ్వానంగా మారాయి. పూడిక తొలగించడం లేదు. ఫలితంగా జలుబు, దగ్గు, జ్వరం, ఒళ్ళు నొప్పులతో ప్రజలు ఆసుపత్రులకు క్యూ కడుతున్నారు.

**డెంగీ లక్షణాలు...**

దోమ కాటు వలన డెంగీ జ్వరం వ్యాపిస్తుంది. డెంగీ బారిన పడిన వారికి తీవ్రజ్వరం, తలనొప్పి వస్తుంది. కళ్ళు తెరవడం కష్టంగా వుంటుంది. చర్మంపై దద్దుర్లు, కండరాలు, కీళ్ళ నొప్పులు ఉంటాయి. రక్తపోటు పడిపోవడం, అధిక దాహం వేస్తుంది. డెంగీ నిర్ధారణలో ప్లేట్ లెట్ కౌంట్ తదితర కారణాలను పరీక్షల ద్వారా నిర్ధారిస్తారు. ఎక్కువగా శాతం పండ్ల రసాలు తాగించాలి. దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ■

# తెలంగాణాలో ఇక ఊరూరా 'మీసేవ' కేంద్రాలు

## మహిళా స్వయం సహాయ సంఘాలకు మంజూరు

**ఆ**న్‌లైన్ ద్వారా ప్రభుత్వ, ప్రైవేటుకు చెందిన వందలాది సేవలందిస్తున్న మీసేవ కేంద్రాలను ఊరూరా ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

మహిళాశక్తి పథకం కింద రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల మహిళలకు వీటిని మంజూరు చేయనుంది. కేంద్రాల ఏర్పాటుకు ముందుకొచ్చే సంఘాలను ఎంపిక చేయాలని అన్ని జిల్లాల కలెక్టర్లను తాజాగా ఆదేశించింది. పంద్రాగస్టు నాటికి వీటిని ప్రారంభించాలని ప్రభుత్వం యోచిస్తోంది.




ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 4,525 మీ సేవ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో మూడు వేల వరకు నగర, పట్టణ ప్రాంతాల్లో ఉన్నాయి. రాష్ట్రంలో 12,769 గ్రామ పంచాయతీలుండగా.. వేయిన్నర వరకే గ్రామాల్లో ఉన్నాయి.

ధ్రువీకరణపత్రాలతో పాటు ఆధార్ సేవలు, దరఖాస్తులు, చెల్లింపులు సహా 150కి పైగా ప్రభుత్వ, 600కు పైగా ప్రైవేటు కార్యకలాపాల కోసం గ్రామీణ ప్రాంతాల ప్రజలు పట్టణాలు, నగరాల్లోని కేంద్రాల వద్దకు వెళ్లాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మహిళాశక్తి పథకం కింద మీసేవ కేంద్రాలను అందుబాటులోకి తేవాలని నిర్ణయించింది.

**గ్రామైక్య సంఘాల పేరిట..**

గ్రామైక్య సంఘాల (విలేజ్ ఆర్గనైజేషన్)పేరిట మహిళా శక్తి మీసేవ కేంద్రాలను (ఎమ్మెస్ ఎమ్మెస్సీ) రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తుంది.

కేంద్రం ఏర్పాటుకు రూ. 2.50 లక్షల రుణాన్ని స్త్రీనిధి ద్వారా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంజూరు చేస్తుంది. వీటితో ప్రభుత్వ అధికారుల పర్యవేక్షణలో పేరొందిన కంపెనీల నుంచి కంప్యూటర్లు, ప్రింటర్లు, జీపీఎస్, బయోమెట్రిక్ పరికరాలు, కెమెరా, ఇంటర్నెట్ కనెక్షన్ కొనుగోలు చేయాలి. కేంద్రాలు ప్రారంభమైన తర్వాత ఆయా సంఘాలు రుణాన్ని నెలనెలా తిరిగి చెల్లించాలి.

స్త్రీనిధి, స్థానికంగా ఉన్న గ్రామ పంచాయతీ, ప్రభుత్వ పాఠశాల, రైతు వేదిక, అంగన్‌వాడీ కేంద్ర భవనాలు లేదా ఇతర ప్రభుత్వ భవనాలు, వాటి ప్రాంగణాల్లో మీ సేవ కేంద్రానికి 10 అడుగుల పొడవు, పది అడుగుల వెడల్పుతో వసతి కల్పిస్తారు.

ఆయా సంఘాల్లో ఇంటర్ ఉత్తీర్ణులైన సభ్యురాళ్లను మీ సేవ ఆపరేటర్లుగా ఎంపిక చేస్తారు. కేంద్రం నిర్వహణ, సేవలపై మీ సేవ సంస్థ ద్వారా శిక్షణ ఇస్తారు. అనంతరం ఆయా మహిళా సంఘాలతో మీసేవ సంస్థ అవగాహన ఒప్పందం చేసుకుంటుంది.

ఈ కేంద్రాల్లో ప్రభుత్వం నిర్దేశించిన రుసుముల మేరకు పారదర్శకమైన సేవలందిస్తారు. మీసేవ అధికారులు ఎప్పటికప్పుడు ఆయా కేంద్రాలను పరిశీలించి వాటి నిర్వహణను పర్యవేక్షిస్తారు. ఆగస్టు 15 నాటికి వాటిని ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తోంది. ■

# నేల ఆరోగ్యం - ఉత్పాదకత పెంపుదల

ఆరోగ్యంగా ఉన్న నేలకు ప్రతికూల పరిస్థితులను తట్టుకునే బలం ఉంటుంది
నేల ఆరోగ్యంగా ఉండాలంటే, అందులో తగినంత సేంద్రియ పదార్థం ఉండాలి

## చేపట్టే పనులు



లోతుగా దుక్కులు దున్నడం



మల్చింగ్



పొలంలో పచ్చి రొట్ట ఎరువు సాగు



వైవిధ్య పంటల సాగు



చెరువు మట్టి చల్లడం



పంటలమార్పిడి



జీవ ఎరువుల వాడకం



నాణ్యమైన విత్తనాల వాడకం

MAHILA SADHIKARATHA
Publication Date: 01-08-2024 ; Posting Date: 05 & 06-08-2024

RNI Regd No: TELTEL / 2003 /16365
Postal Regd No: HD/1064/2024-26

## ఏపిమాస్ 23 వ వార్షికోత్సవ సందర్భంగా ఒకే వేదికపై ఏపిమాస్ కుటుంబ సభ్యులు !







ఏపిమాస్ వార్షికోత్సవ కేక్ కటింగ్ ... ఆట పాటలతో ఆనంద హేల ... మహిళా సాధికారత కొత్త సంచికతో ...





ఎఫ్ పి ఓల వార్షిక మహాసభలు : తవనంపల్లి ... ఆదివాసి గిరిజన ... గుర్రంకొండ





ఎఫ్ పి ఓల వార్షిక మహాసభలు : నల్లారెడ్డి స్వామి ... ఉధ్వల ... కౌండిన్య

To ADDRESS



నిర్మల్ లో 'వాష్' సమావేశం

బట్వాడా కాకపోతే దయచేసి
ఈ చిరునామాకు తిప్పిపంపండి

ఎడిటర్, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్,
డ్రీమ్ వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089